ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..

Q6 NEWS తెలుగు

మేడ్చల్ | సోమవారం | 27.07.2026 | సంపుటి : 2 | సంచిక : 25 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : గడ్డమీది నాగరాజు


# రాజకీయాల్లో యువశక్తి భాగస్వామ్యమవ్వాలి



వికసిత్ భారత్ 2047, సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ వంటి నినాదాలతో మాత్రమే మార్పు రాదని, యువశక్తిని సరైన దిశలో నడిపించి దేశ భవిష్యత్తుతో వారిని అనుసంధానం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అందులో భాగంగానే ఒకప్పుడు 'జై జవాన్, జై కిసాన్' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు 'జై జవాన్, జై కిసాన్, జై యువ' అనే నినాదంతో ముందుకెళుతుందని చెప్పారు. యువశక్తి ఇక రోడ్లపై పోరాడటమే కాదు, పార్లమెంట్‌లోకి రావడానికి సిద్ధంగా ఉందని, చట్టాలను కేవలం పాటించడానికే కాదు, రూపొందించడానికీ సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

### పార్లమెంట్‌లోకి రావడానికి, చట్టాలు చేయడానికీ యువత సిద్ధంగా ఉంది

### అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించాలి

### వయోపరిమితి తగ్గింపుపై వర్షాకాల సమావేశాల్లోనే చర్చ జరగాలి

### జాతీయ మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 25 : 'జై జవాన్.. జై కిసాన్'తోపాటు ఇకపై 'జై యువ' నినాదంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువశక్తిని రాజకీయ వ్యవస్థలో భాగస్వామ్యం చేస్తే.. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుందని పేర్కొన్నారు. యువతతో పోరాడాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తే.. గెలుపు ఎవరిదో కాలమే నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జాతీయ మీడియాతో మాట్లాడారు. దేశంలో యువశక్తి ముందు

-మిగతా 2 లో..



## సంస్కరణల కోసం హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

### ప్రధాని మోదీ కీలక అప్‌డేట్..

**నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు.**

న్యూఢిల్లీ, జూలై 25 : నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "ఈ టాస్క్‌ఫోర్స్ పరీక్షల సంస్కరణలపై దృష్టి పెడుతుంది. కమిటీ నివేదిక ఆధారంగా విశ్వసనీయత దెబ్బతినకుండా భవిష్యత్‌లో పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రశ్నపత్రం

-మిగతా 2 లో..



## సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకండి

### కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్

న్యూఢిల్లీ, జూలై 25 : ఆదాయపు పన్ను శాఖ అధికారులు సామాన్యుల ప్రయోజనాల కోసం పనిచేయాలని, ప్రతి చిన్న పనికి వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ హితబోధ చేశారు. అధికారులు తమ విధుల్లో పూర్తి సామర్థ్యంతో, నిజాయతీగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో ప్రభుత్వ శాఖల నిర్లక్ష్య వైఖరి పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయిలో కొత్త 'ఆయ్‌కార్ సింధు' భవనాన్ని నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఐటీ అధికారులను ఉద్దేశించి ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదాయపు పన్ను శాఖ ప్రభుత్వ ఏజెన్సీనే అయినప్పటికీ

-మిగతా 2 లో..



## ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలు

### అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్

హైదరాబాద్, జూలై 25 : ఇందిరమ్మ ఇళ్ల పేరుతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. రూ.10,000 ఈఎండీ చెల్లింపుల పేరుతో నకిలీ కాల్స్, లింకుల ద్వారా మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. డబ్బులు చెల్లిస్తే ఇల్లు ఇప్పిస్తామంటూ మోసగాళ్లు చెప్పే

-మిగతా 2 లో..



## మూడేళ్లలో కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పూర్తి

### భూసేకరణ పూర్తిచేస్తే గుట్టకు ఎంఎంటీఎస్ పనులు

### తెలంగాణలో రూ.48 వేల కోట్లతో రైల్వే పనులు

### కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**మరో మూడేళ్లలో మనోహరాబాద్--కొత్తపల్లి రైల్వే లైన్ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం సమీపంలో రూ. 6 కోట్లతో నిర్మించిన కొమురవెల్లి రైల్వే స్టేషన్‌ను ఆయన ప్రజలకు అంకితం చేశారు.**

సిద్దిపేట, జూలై 25 : డిసెంబర్ నాటికి సిరిసిల్ల, 2028 జూన్ నాటికి వేములవాడ రైల్వే స్టేషన్లను అందుబాటులోకి, 2029 నాటికి కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టును పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభం చరిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. సికింద్రాబాద్ నుంచి యాదగిరి గుట్టకు ఎంఎంటీఎస్ రైల్వేలైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తే రైల్వే పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఏడు బుల్లెట్ ట్రైన్‌లు ఉండగా వాటిలో మూడు తెలంగాణ

-మిగతా 2 లో..

## దేశవ్యాప్తంగా 'ఫీజు రీయింబర్స్‌మెంట్' అమలు చేయాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. నేడు రీయింబర్స్‌మెంట్ బకాయిల పేరుతో భాజపా రాజకీయాలు చేస్తోందన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడైనా ఈ పథకాన్ని అమలు చేస్తుందా చెప్పాలని మంత్రి ఆదివారం ఒక ప్రకటనలో సవాల్ విసిరారు.**



హైదరాబాద్, జూలై 25 : భారాస ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టినప్పుడు భాజపా రాష్ట్రాధ్యక్షుడు రామచందర్‌రావు ఎందుకు మౌనం వహించారో చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎన్నికల్లో పోటీచేసే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలని చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ఈ ప్రతిపాదనకు భాజపా మద్దతు ఇస్తుందా? లేదా? రామచందర్‌రావు స్పష్టం చేయాలని పొన్నం డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ స్పష్టమైన అభిప్రాయంతో ఉందన్నారు. పరీక్ష పేపర్ల లీకేజీతో విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటున్న భాజపాకు.. వారి గురించి ప్రశ్నించే నైతిక అర్హత లేదని పొన్నం పేర్కొన్నారు.



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 140 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 167 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 259 (కిలో) |
| స్కిన్ లెస్ | 292 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹98

## సెమీకండక్టర్ మిషన్-2.0లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలి

### 'రైజింగ్ భారత్ సమిట్- సౌత్ ఎడిషన్' చర్చాగోష్ఠిలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూలై 25 : భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రం అమలు చేస్తున్న 'ఇండియా సెమీ కండక్టర్ మిషన్-2.0'లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. మలిదశ సెమీకండక్టర్ తయారీ పెట్టుబడులకు రాష్ట్రానికి అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. హైదరాబాద్ దేశంలోనే సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీలు)

-మిగతా 2 లో..





## పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర అస్వస్థత

### సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో నర్సంపేట మాజీ ఎమ్మెల్యే

### అత్యుత్తమ చికిత్సకు కేసీఆర్ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 25 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు తెలిసింది. సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఉదయం హనుమకొండ హంటర్ రోడ్డులోని

-మిగతా 2 లో..

## చెర్వుగట్టులో అగ్నిప్రమాదం

### దగ్ధమైన దుకాణాలు.. రూ.3 కోట్ల ఆస్తి నష్టం

**నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవస్థానం వద్ద ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ అయి 17 వస్తు విక్రయ దుకాణాలు ఆహుతయ్యాయి. ఈ సంఘటనలో దాదాపు రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.**





# సంస్కరణల కోసం హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

(మొదటిపేజీ తరువాయి)

లీకేజీని అరికట్టేందుకు కఠినమైన చట్టం తీసుకొస్తున్నాం. దీనికి సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. విశ్వసనీయమైన, పారదర్శకమైన పరీక్ష విధానం అమలు చేస్తాం. పరీక్షల నిర్వహణలో అత్యున్నత టెక్నాలజీని అవలంబిస్తాం" అని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా ఉంటారు. యస్. సోమనాథ్ (ఇస్రో మాజీ ఛైర్మన్), తపన్ డేకా (ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్), వి. కామకోటి (ఐఐటీ మద్రాస్ డైరెక్టర్), అనితా కర్వాల్ (కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి), అమృత్ లాల్ మీనా (లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు).

**ప్రధాన బాధ్యతలు**

ఎన్‌టీఏ పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం
పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం
పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం
పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం
డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం
భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం



# మూడేళ్లలో కొత్తపల్లి రైల్వే ప్రాజెక్టు పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతానికి అనుసంధానం కావడంతో ఎంతో ప్రయోజనం కలుగుతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వం ఏది ఉన్నా నరేంద్రమోదీ సమన్యాయం పాటించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు కేంద్ర హోంశాఖ సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కొమురవెల్లి భక్తుల కల సాకారం అయిందని, ఆలయ అభివృద్ధి, విస్తరణకు రవాణా వ్యవస్థ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీలు రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ దత్తాత్రేయ, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభ వేడుకల్లో ప్రొటోకాల్ అంశం వివాదాలకు దారి తీసింది. ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. మరోవైపు జై శ్రీరామ్ అంటూ కొందరు నినాదాలు చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ప్రొటోకాల్ అంశంపై జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి ప్రారంభ వేడుక కంటే ముందే వెళ్లిపోయినట్టు సమాచారం.

# సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకండి

(మొదటిపేజీ తరువాయి)

ఈ ప్రాజెక్ట్ అనుమతుల కోసం ఆ శాఖ పడిన ఇబ్బందికర పరిస్థితుల గురించి ఆమె గుర్తుచేశారు. ఒక ప్రభుత్వ సంస్థే ఇలా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు. సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని, వారి తరఫున అధికారులే చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగని నిబంధనలను ఉల్లంఘించాలని చెప్పడం లేదన్నారు. వారు పొందాలనుకున్న సర్వీసులను జాప్యం లేకుండా అందించాలన్నారు. ఈ దేశంలో సామాన్యులు తమ న్యాయపరమైన హక్కులను పొందడానికి కష్టపడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



# సెమీకండక్టర్ మిషన్-2.0లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాన నిలయంగా ఎదిగిందని ఆయన తెలిపారు. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన 'రైజింగ్ భారత్ సమిట్- సౌత్ ఎడిషన్' చర్చాగోష్ఠిలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దక్షిణ భారత్‌లో ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, సాంకేతికాభివృద్ధి, ఆర్థికవృద్ధిపై చర్చించేందుకు రాజకీయ నాయకులు, విధాన రూపకర్తలు, పారిశ్రామిక నిపుణులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో శ్రీధర్‌బాబు తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై ప్రసంగించారు. "వేగంగా విస్తరిస్తున్న జీసీసీ వ్యవస్థ, అత్యున్నత సాంకేతిక పరిశ్రమలు, అధునాతన తయారీ రంగాలకు ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యాన్ని తెలంగాణ ప్రతిబింబిస్తోంది. ప్రపంచంలోని ప్రముఖ సెమీకండక్టర్ డిజైన్ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారింది. ఈ బలాన్ని గుర్తించి 'సెమీకండక్టర్ మిషన్-2.0'లో రాష్ట్రానికి తగిన ప్రాధాన్యం ఇచ్చి చిప్ తయారీ పెట్టుబడులను ఆకర్షించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి" అని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# జై 'యువ'

(మొదటిపేజీ తరువాయి)

56 అంగుళాల ఛాతీ తలవంచిందన్నారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న వైఫల్యాలపై దేశవ్యాప్తంగా యువత పోరాటం చేయడంతోనే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. "వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చి దేశ రైతాంగాన్ని కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించింది. అప్పట్లోనే లోక్‌సభలో రాహుల్ గాంధీ ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ.. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల మాటలను కేంద్రం పట్టించుకోకపోవడంతో.. రైతులు వీధుల్లోకి వచ్చి నెలల తరబడి పోరాడారు. చివరకు కేంద్రం ఆ చట్టాలను వెనక్కి తీసుకొని రైతులకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది. ఇప్పుడు పరీక్షలు రాసిన విద్యార్థులు విఫలం కాలేదు. సీబీఎస్ఈ, నీట్ తదితర జాతీయ స్థాయి పరీక్షలను సమర్థంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా విఫలమైంది. ఈ అంశంపై రాహుల్ గాంధీ సహా ప్రతిపక్షాలు పలుమార్లు కేంద్రాన్ని హెచ్చరించినా పట్టించుకోలేదు. దేశ యువత వీధుల నుంచి పార్లమెంట్ వరకు తమ శక్తిని ప్రదర్శించింది. ప్రధానమంత్రి రాజీనామాను యువత కోరుతున్న పరిస్థితుల్లో.. ధర్మేంద్ర ప్రధాన్‌ను తప్పించడం ద్వారా కేంద్రం నష్టనివారణ చర్యలకు దిగింది. అదే సమయంలో విద్యార్థులపై నమోదైన అన్ని కేసులను ఉపసంహరించుకోవాలి. నీట్ లీకేజీ కారణంగా పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు కేంద్రం ఆర్థిక సాయం అందించాలి. అదేవిధంగా ప్రధాని మోదీ.. దేశ యువతకు క్షమాపణ చెప్పాలి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 21 ఏళ్ల యువత ఐఏఎస్, ఐపీఎస్‌లుగా,



ఫార్చ్యూన్-500 కంపెనీల సీఈఓలుగా రాణిస్తున్నారు. అలాంటి యువత దేశ రాజకీయాల్లో ఎందుకు భాగస్వాములు కాలేరు? కాబట్టి ప్రస్తుత చట్టాలను కూడా కాలానుగుణంగా మార్చాల్సిన అవసరం ఉంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు.. శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే వయసును 30 ఏళ్ల నుంచి 25 ఏళ్లకు తగ్గించాలి. ఈ మేరకు రానున్న అసెంబ్లీ, మండలి సమావేశాల్లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తాం. పార్లమెంట్ సమావేశాల్లో సీట్ల పెంపు, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్, ఎన్నికల్లో పోటీచేసే వయోపరిమితి తగ్గింపుపై సమగ్రంగా చర్చించాలి. అవసరమైతే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసి.. అన్ని రాజకీయ పక్షాలు, భాగస్వామ్య వర్గాల అభిప్రాయాలను తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

### మోదీకి ఇది రెండో పరాజయం

'దేశంలోనే అత్యంత శక్తివంతుడు తానేనని భావించే మోదీకి ఇది రెండో పరాజయం. రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలు తెచ్చినప్పుడే రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఈ చట్టాలను దేశ ప్రజలు అంగీకరించరని, విరమించుకోవాలని సూచించారు. కానీ మోదీ తనను ఏమీ చేయలేరని భావించారు. రైతులకు క్షమాపణలు చెప్పాల్సి వస్తుందని నాడు రాహుల్‌గాంధీ చెప్పినా వినలేదు. చివరకు దేశ వ్యాప్తంగా రైతులు ఉద్యమబాట పట్టారు. ప్రాణాలు పోయినా వెనక్కు తగ్గకుండా ఉద్యమించి మోదీని వెనక్కు తగ్గించారు. ఆ మూడు నల్లచట్టాలను విరమించుకునేలా చేసి రైతులకు క్షమాపణలు చెప్పించారు. దాన్ని ఒక పాఠంగా తీసుకుని మోదీ మారతారని, ప్రతిపక్షానికి గౌరవం ఇస్తారని భావించాం. కానీ మారలేదు. పాత ధోరణినే కొనసాగించారు.

### ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి

విద్యా రంగంలోనూ అదే పరిస్థితి కనిపించింది. యూజీసీ--నెట్ సహా అనేక పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. పరీక్షలు రాసిన విద్యార్థులు విఫలం కాలేదు.. పరీక్షలను సక్రమంగా నిర్వహించాల్సిన కేంద్ర ప్రభుత్వమే విఫలమైంది. ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, సీబీఐ, నార్కోటిక్స్ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి బెదిరించి విద్యార్థులను, వారి పక్షాన మాట్లాడిన వారిని నియంత్రించాలని ప్రయత్నించారు. దేశమంతా వీధుల నుంచి పార్లమెంట్ వరకు తమ శక్తిని యువత చాటింది. 56 అంగుళాల ఛాతీ అంటూ గొప్పలు చెప్పుకున్న అహంకారాన్ని ఓడించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మాత్రమే కాదు.. నీట్ ఘటనల్లో తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలకు కేంద్రం ఆర్థికసాయం అందించాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలి. ప్రధాని మోదీ క్షమాపణలు చెప్పాలి. రాహుల్‌గాంధీ కోరినట్టు అది జరగకపోతే యువశక్తి మరో ఉద్యమం చేపడుతుంది..' అని రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మోసాలు

(మొదటిపేజీ తరువాయి)



మాటలు నమ్మొద్దని సూచించారు. "ఈ రోజే చివరి తేదీ అంటూ భయపెట్టి డబ్బులు కాజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాట్సప్, ఎస్ఎంఎస్‌లలో వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయొద్దు. AnyDesk, TeamViewer వంటి స్క్రీన్ షేరింగ్ యాప్‌లు ఇన్‌స్టాల్ చేయవద్దు. యూపీఐ పిన్.. రీఫండ్ కోసం అవసరం లేదు, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పొద్దు. ఆధార్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అపరిచితులతో పంచుకోవద్దు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తిగా పారదర్శకం.. దళారులకు ఎలాంటి అవకాశం లేదు. ఇల్లు కేటాయించకపోతే ఈఎండీ మొత్తాన్ని ప్రభుత్వమే దరఖాస్తుదారుడి బ్యాంకు ఖాతాలోకి తిరిగి జమ చేస్తుంది. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలి. లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి" అని సీపీ సూచించారు.

# ఉక్రెయిన్‌లో నౌకపై దాడి.. ఇద్దరు భారతీయుల గల్లంతు



**ఉక్రెయిన్ :** ఉక్రెయిన్‌కు చెందిన ఒడెసా పోర్టు వద్ద భారతీయ నావికులున్న వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు సురక్షితంగా బయటపడగా, మరో ఇద్దరి జాడ తెలియరాలేదు. నల్ల సముద్రంలో ఒడెసా ఓడరేవు వద్ద 'ఎంవీ ఏజీఎన్ రాగ్నర్' మర్చంట్ నౌకపై శనివారం (జులై 25న) ఈ దాడి జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై ఉక్రెయిన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం స్పందించింది. దాడి జరిగిన సమయంలో నౌకలో నలుగురు భారతీయులు ఉన్నట్లు వెల్లడించింది. ఇద్దరు గల్లంతయ్యారని, మరో ఇద్దరు సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. గల్లంతైన సిబ్బంది కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎంబసీ పేర్కొంది. ఇందుకోసం ఉక్రెయిన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది.

# హర్మూజ్‌లో 'రుసుము'పై ఇరాన్, ఒమన్ చర్చలు



**టెహ్రాన్:** హర్మూజ్ జలసంధి నిర్వహణ విషయంలో ఒమన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతున్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ తెలిపారు. రెండు రోజులపాటు ఇరుదేశాల డిప్యూటీ విదేశాంగశాఖ మంత్రులు టెహ్రాన్‌లో దీనిపై విస్తృత చర్చలు జరిపినట్లు ఆయన వెల్లడించారు. ఇరుదేశాల సార్వభౌమాధికారానికి నష్టం వాటిల్లకుండా, వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా సాంకేతిక, రాజకీయపరమైన అంశాలపై చర్చలు జరిగినట్లు తెలిపారు. అమెరికా దళాలు దాడులు నిలిపివేయడంతో ఒమన్‌తో చర్యలు పురోగమిస్తున్నాయని ఆయన అన్నారు. హర్మూజ్ గుండా ప్రయాణించే నౌకలకు సేవా రుసుములు విధించడంపై చర్చిస్తామని ఒమన్, ఇరాన్ దేశాలు జూన్‌లోనే ప్రకటించాయి. అది అమెరికాకు రుచించలేదు. దీంతో ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం కుదిరిన రోజుల వ్యవధిలోనే .. హర్మూజ్ కేంద్రంగా మరోసారి వివాదం మొదలైంది. హర్మూజ్‌పై పట్టు సాధించేందుకు అమెరికా మరోసారి దాడులు మొదలు పెట్టింది. యూఎస్ఏ చర్యలను ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటించింది. హర్మూజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. తమ అనుమతి లేకుండా ఒక్క నౌకను కూడా హర్మూజ్ దాటనివ్వబోమని హెచ్చరించింది. దీంతో హర్మూజ్‌కు మరోవైపు ఉన్న ఒమన్ తీరం గుండా నౌకలు ప్రయాణించేలా అమెరికా ప్రోత్సహించింది. అందుకు ఒమన్ కూడా అంగీకరించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్.. బెదిరింపులకు దిగడంతో ఆ దేశం మిన్నకుండిపోయింది. గత కొన్ని రోజులుగా ఇరాన్‌పై అమెరికా దాడులు నిలిపివేయడంతో.. టెహ్రాన్, మస్కట్ మధ్య చర్చలు ఊపందుకున్నాయి.



# పెద్ది సుదర్శన్‌రెడ్డికి తీవ్ర అస్వస్థత

(మొదటిపేజీ తరువాయి)

తన నివాసంలో దినపత్రిక చదువుతుండగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందికి గురయ్యారు. దీంతో కుటుంబసభ్యులు వెంటనే స్థానిక రోహిణి ఆస్పత్రికి తరలించారు. ఉదయం 8 గంటల సమయంలో కార్డియాలజిస్టు మమత, డాక్టర్లు ప్రాథమిక చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పింది. డాక్టర్ మమత 9 సార్లు సీపీఆర్ చేశారు. కొద్దిగా కోలుకున్న తర్వాత అంజియోగ్రామ్, ఇతర పరీక్షలు నిర్వహించారు. రక్తనాళాల్లో గడ్డలు గుర్తించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఇందుకోసం అంబులెన్సుకు పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌ను ఎక్కడికక్కడ నిలిపివేసి దారిని సుగమం చేసారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో యశోదా ఆస్పత్రికి చేరుకోగా..వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నారు. గుండె, ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని, పరిస్థితి కొంత విషమంగానే ఉన్నట్లు తెలిసింది. పరిస్థితి మెరుగుపడని పక్షంలో ఎక్మోపై ఉంచాలని ఆలోచిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సుదర్శన్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం ఎప్పటికప్పుడు ఆరా తీశారు. ఆయనకు అత్యుత్తమ వైద్యం అందేలా చూడాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదేశించారు. కాగా కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీశ్‌రావు, నేతలు పోంచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బోయినిపల్లి వినోద్‌కుమార్, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, పింగిళి శ్రీపాల్‌రెడ్డి తదితరులు రోహిణి ఆస్పత్రికి వెళ్లారు. తర్వాత సికింద్రాబాద్ ఆస్పత్రిలో కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఎంపీలు మాలోతు కవిత, వినోద్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్యరావు, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులు సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



# చెర్వుగట్టులో షాట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

## దగ్ధమైన దుకాణాలు.. రూ.3 కోట్ల ఆస్తి నష్టం

**నార్కట్‌పల్లి:** నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు దేవస్థానం వద్ద ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ అయి 17 వస్తు విక్రయ దుకాణాలు ఆహుతయ్యాయి. ఈ సంఘటనలో దాదాపు రూ.3 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. చెర్వుగట్టు గ్రామ పంచాయతీ దుకాణాల సముదాయం వద్ద భక్తులకు విక్రయించేందుకు బొమ్మలు, వివిధ ప్లాస్టిక్ వస్తువుల దుకాణాలున్నాయి. ఆ షాపుల ముందు ఏర్పాటు చేసిన రేకులకు స్తంభం నుంచి వచ్చే వైర్ ద్వారా ఆదివారం తెల్లవారు జామున 3.15 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక షాపులో మంటలు చెలరేగాయి. ఈ మంటలు వరుసగా ఉన్న 17 షాపులు, తోపుడు బండ్లకు ఒకదాని వెంట మరోదానికి అంటుకుని కాలి బూడిదయ్యాయి. విషయం తెలిసిన వెంటనే నల్లగొండ, నార్కట్‌పల్లి సీఐలు ఆదిరెడ్డి, సురేశ్, ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. నల్లగొండ, రామన్నపేట, నకిరేకల్ నుంచి అగ్నిమాపక వాహనాల ద్వారా ఉదయం 5.30 గంటల వరకు మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘటన స్థలానికి విచ్చేసి బాధితులకు తక్షణ సాయంగా రూ.20 వేల చొప్పున అందజేశారు. నష్టం జరిగిన దుకాణదారులకు ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలసి ఈ సంఘటనను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధితులకు త్వరలో తగిన న్యాయం చేస్తామన్నారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కూడా పరామర్శించారు.

జనం వార్త

సోమవారం 27 జులై 2026 | 3



## శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణంతో మానసిక ప్రశాంతత

**కూకట్‌పల్లి జూలై 26 (జనం వార్త) :** కుత్బుల్లాపూర్‌లోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయములో ఆదివారం శ్రీమద్భగవద్గీత శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణ సహిత 40/108వ హవన జ్ఞాన యజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లోకకళ్యాణార్థం చేపట్టిన ఈ యజ్ఞ, పూజా కార్యక్రమాలలో స్థానిక భక్తులు పాల్గొనాలని ఆలయ వేద పండితులు సూచించారు. శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆధ్యాత్మిక చింతన లభిస్తుందన్నారు.



## లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

**కూకట్‌పల్లి, జూలై 26, (జనం వార్త) :** లయన్స్ ఇంటర్నేషనల్ లో జిల్లా 320 బి లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఇతర లయన్స్ క్లబ్ లకు ఆదర్శంగా ఉంటాయని పి ఐ డి లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. 320 బి జిల్లా శాఖ 11వ క్యాబినెట్ విస్తరణ కార్యక్రమం కొంపల్లి లోని ఓ ఫంక్షన్ హాల్ లో ఆదివారంనిర్వహించారు. ఈ సందర్భంగా 320 బి నూతన గవర్నర్ శైలజ నాయర్, ఫస్ట్ వాయిస్ జిల్లా గవర్నర్ గా అవంతి రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి లతో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పి ఐ డి లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు మాట్లాడుతూ జిల్లా గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన శైలజ నాయర్ పట్టుదలతో పని చేసే వ్యక్తిత్వం గల వ్యక్తి అన్నారు. ఆమె మార్గదర్శకంలో జిల్లాలోని క్లబ్బులు మరింత చురుకుగా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నేత్రదానం ఆవిష్కతను గుర్తు చేస్తూ ప్రత్యేక పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్స్టలేషన్ చైర్మన్ హాలోక్ కుమార్ జ, డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్లు సెల్వ సాయిరాంరాజు, రాజేంద్రప్రసాద్, ఎస్ ఎన్ రెడ్డి, దీపక్ భట్టాచార్య, విద్యాసాగర్ రావు, విజయ్ కుమార్ శెట్టి, మోహన్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ హేమల్ కన్విద్ తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో కూచిపూడి నృత్య వైభవం

### కళాభిమానులను అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



**శేరిలింగంపల్లి, జూలై 26(జనం వార్త):** మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టు కున్నాయి. కూచిపూడి నృత్య ప్రదర్శనలతో కళాకారులు భారతీయ సాంప్రదాయ నృత్య వైభవాన్ని ఆవిష్కరించి కళాభిమానుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా లండన్‌కు చెందిన కూచిపూడి నాట్య కళాకారుడు వైష్ణవ దాచవరం "దేవా దేవం భజే", "ఆడెనమ్మా హరుడు", "ఆంజనేయ అనిలజ హనుమంత" వంటి భక్తిరస ప్రధాన నృత్యాంశాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆయన హావభావాలు, నృత్య నైపుణ్యం సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కుమారి సత్యా నందిని, కుమారి రమ్య సాహితి బృందం "గజవదాన బెదువే", "వెడెలెరా వయ్యారాలు", "కొలువైతి వరంగశాయి", "నారాయణీయం", "క్షీరసాగరాశయన", "మండూక శబ్దం", "కేశవ నారాయణ", "ముద్దుగారే యశోద" తదితర కూచిపూడి నృత్యాంశాలను ఎంతో నైపుణ్యంతో ప్రదర్శించారు. వారి భావ వ్యక్తీకరణ, లయబద్ధమైన నృత్య విన్యాసాలు ప్రేక్షకులను ముగ్ధులను చేశాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కళాభిమానులు కళాకారుల ప్రతిభను అభినందిస్తూ చప్పట్లతో ప్రోత్సహించారు. భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం నిరంతరం నిర్వహించడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమం ఆద్యంతం సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ విజయవంతంగా సాగింది.




## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీనీ నిలబెట్టుకోవాలి

### తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్

**చేగుంట, జూలై 26(జనం వార్త):** ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నా పోస్టర్ ను తపస్ చేగుంట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేశ్,తంగేళ్ల పల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ వరంగల్ ఏకశిలా పార్కు వద్ద సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ధర్నాకు హాజరై, అప్పటి పిసిసి ప్రెసిడెంట్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేము అధికారంలోకి వచ్చిన 100 రోజులలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు హామీలను నెరవేర్చకపోవడం శోచనీయమని, 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన జీతాన్ని వెంటనే చెల్లించాలని,కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా జీఓ 317 బాధితులందరికీ న్యాయం, సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు, పెండింగ్ డిఏలను, జిపిఎఫ్ బకాయిల విడుదల, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల లోపే పిఆర్సి అమలు, మోడల్ స్కూల్, కేజీబివి, గురుకుల, రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు సురేందర్, తపస్ జిల్లా కార్యదర్శి సుమతి, కార్యవర్గ సభ్యులు రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో 62 అంగన్వాడీ పోస్టులు

- వచ్చే నెల 5లోగా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలి
- దరఖాస్తు ప్రతులను తమ కార్యాలయంలో సమర్పించాలి
- జిల్లా సంక్షేమాధికారిని శారద

**మేడ్చల్ :** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖలోని మూడు ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్టులు అల్వాల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్ లలో ఖాళీగా ఉన్న 62 అంగన్వాడీ టీచరు పోస్టులు భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నారు. దరఖాస్తులు ఈ నెల జులై 27 నుంచి వచ్చే నెల ఆగస్టు 5 వరకు చేసుకోవచ్చు. దరఖాస్తులు క్రింద తెలిపిన వెబ్ సైట్ లో చేసుకోవాల్సి ఉంటుంది. ఖాళీలు, విద్యార్హత, వయస్సు, స్థానికత సంబంధించిన పూర్తి వివరములు http://wdcw.tg.nic.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. అల్వాల్, మేడ్చల్, కుత్బుల్లాపూర్ ప్రాజెక్టులలో 18,20,24, మొత్తం 62 పోస్టున్నాయి. ప్రాజెక్టు వారీగా ఖాళీల పూర్తి వివరాలు జతపరచడం జరిగింది. సదరు అభ్యర్థునీలు తప్పనిసరిగా ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయస్సు జులై 1, 2026 నాటికి 18 సంవత్సరముల నుండి 35 సంవత్సరములలోపు ఉండాలి. దరఖాస్తు చేసుకోబోయే మహిళ అభ్యర్థులు అంగన్వాడీ కేంద్రానికి తప్పనిసరిగా స్థానిక వాస్తవ్యులై ఉండాలి. గ్రామీణ ప్రాంతానికి చెందిన వారు సదరు గ్రామ పంచాయతీ నివాసులై ఉండాలి. పట్టణ ప్రాంతానికి జీ.హెచ్.ఎం.సీ, ఎం.ఎం.సి, సి.ఎం.సి లకు చెందినవారై, ఆ ప్రాంత వార్డ్ కు చెంది ఉండాలి. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఎస్సీ, ఎస్టీ లకు కేటాయించిన, అంగన్ వాడీ టీచర్ పోస్టులకు అదే హామ్లెట్,ఆవాసంల కు చెందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఇందుకు సంబంధించి,సంబందిత తహసిల్దార్ గారిచే ధృవీకరించిన నివాస ధృవీకరణ పత్రము తప్పనిసరిగా జతచేయవలసి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఒక సంవత్సరము లోపు తీసుకున్న నివాస ధ్రువీకరణ పత్రములను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. పోస్టు వారీగా నిర్దేశించిన రోస్టర్ పాయింట్ (కులం,వర్గం)కు సంబంధించిన అభ్యర్ధనులు మాత్రమే అర్హులు. ఒక వేళ అభ్యర్థిని పేరులో ఏమైనా మార్పు ఉన్నట్లయితే అది గెజిట్ లో గాని, కోర్టు ఉత్తర్వులు గాని ఉంటనే ఆ అభ్యర్ధని పేరును పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది.

**వీరు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు:**

పోస్టులకు ఈ క్రింద తెలపబడిన వికలాంగులైన అభ్యర్థినులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చును. 1. వినికిడి పరికరాన్ని ఉపయోగించి వినగలిగిన వారు, 2. అంధత్వం ఉన్నప్పటికీ ఇతరుల సహాయం లేకుండా విధులు నిర్వర్తించుకోగలిగిన వారు, 3. కాళ్ళు, చేతులకు సంబంధించిన అంగ వైకల్యం కలిగినప్పటికీ పూర్వ ప్రాథమిక విద్యను నేర్పుటకు గానీ, పిల్లలసంరక్షణ కు ఎలాంటి ఆటంకం లేకుండా చేయగలిగిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్లైన్ అప్లోడ్ చేయవలసిన ధ్రువపత్రాలు: 1. పుట్టిన తేదీ, వయస్సు ధృవీకరణ పత్రము (ఎస్.ఎస్.సి సర్టిఫికెట్ ), 2. కుల ధృవీకరణ పత్రము (తహసిల్దార్ చే జారీ చేయబడినది), 3. విద్యార్హత ధృవీకరణపత్రము, ఇంటర్ మార్కుల జాబితా, 4. నివాస ధృవీకరణ పత్రము (తహసిల్దార్ చే జారీ చేయబడినది), 5. అంగవైకల్యం కలిగిన వారు సదరం సర్టిఫికెట్, 7. అనాథ అయితే అనాథ సర్టిఫికెట్ ( తహసిల్దార్ చే జారీ చేయబడినది), 6. వితంతవు అయితే భర్త మరణ ధృవీకరణ పత్రము, 8. ఓటర్ ఐ.డి కార్డ్, 9. ఆధార్ కార్డ్ జత చేయాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న అంగన్వాడీ కేంద్రానికి సంబంధించిన ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టు కార్యాలయంలో, ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని జిల్లా సమక్షేమాధికారిని శారద సూచించారు.

## విద్యార్థుల పోరాటానికి తలవంచిన కేంద్రం

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయానికి నిదర్శనం



**దుబ్బాక జూలై 26(జనం వార్త) :** రాహుల్ గాంధీ నాయకత్వంలో పార్లమెంట్‌లో విద్యార్థుల గొంతుకగా కాంగ్రెస్ పోరాటం. మిగతా డిమాండ్లను కూడా వెంటనే నెరవేర్చాలి: దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్. విద్యార్థుల న్యాయమైన హక్కుల కోసం సాగిన పోరాటం ముందు కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పలేదని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయంగా దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పటికీ, విద్యార్థులు వెనక్కి తగ్గకుండా ఐక్యంగా పోరాడారని, వారి పోరాటానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ బలమైన మద్దతు ఇవ్వడంతో పాటు పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలను గట్టిగా వినిపించారని తెలిపారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో రాహుల్ గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. విద్యార్థుల పోరాటానికి అండగా నిలిచి, వారి గొంతుకను పార్లమెంట్‌లో బలంగా వినిపించిన రాహుల్ గాంధీకి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అయితే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతోనే విద్యార్థుల సమస్యలు పూర్తిగా పరిష్కరించబడినట్లు కాదని, విద్యార్థులు ముందుకు తెచ్చిన మిగతా న్యాయమైన డిమాండ్లను కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పాతూరి వెంకటస్వామి గౌడ్ డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి పేపర్ లీకేజీలు అరికట్టాలని అలాగే ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉద్యోగ కల్పనలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా మరణించిన విద్యార్థుల కుటుంబాలకు తగిన ఎక్స్‌గ్రేషియా అందించాలని, విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, విద్యార్థుల న వ ు న ్ య ల న ు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరి ంచిన బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన కేంద్ర ప్రభుత్వాన్ని విద్యార్థులు ప్రశ్నించారని, న్యాయం కోసం విద్యార్థులు చేసే పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వారి డిమాండ్లు నెరవేరే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని అని పాతూరి వెంకటస్వామి గౌడ్ స్పష్టం చేశారు. గతంలో కూడా మోదీ ప్రభుత్వం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమించారని, రైతుల ఐక్య పోరాటం ముందు చివరకు కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రైతుల పోరాటం కావచ్చు, విద్యార్థుల పోరాటం కావచ్చు, ప్రజాస్వామ్యంలో ప్రజల ఐక్యత ముందు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల డిమాండ్లను పట్టించుకోక తప్పదని ఆయన అన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, వారి పక్షాన నిలబడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పాతూరి వెంకటస్వామి గౌడ్ స్పష్టం చేశారు.

## చర్చిల్లో ఎస్ఐఆర్ ఓటరు అవగాహన

### ఎస్ఐఆర్ ప్రచారంలో మాజీ కార్పొరేటర్ రాగం



**శేరిలింగంపల్లి, జూలై 26(జనం వార్త):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యుడు అరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్, రాజీవ్ గృహకల్ప కాలనీలలో ఉన్న పలు చర్చిలను సందర్శించి ఓటరు చైతన్య కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు రాగం నాగేందర్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, ఆయనతో పాటు కుటుంబ సభ్యుల శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మాట్లాడిన రాగం నాగేందర్ యాదవ్ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్యంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి అర్హుడిని ఓటరు జాబితాలో నమోదు చేసేలా బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ కాలనీలకు సంబంధించిన పలు సమస్యలను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పాస్టర్లు మాట్లాడుతూ శేరిలింగంపల్లి డివిజన్ అభివృద్ధికి రాగం నాగేందర్ యాదవ్ చేసిన సేవలను కొనియాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డు సభ్యులు శ్రీకళ, కనకలక్ష్మి, శ్రీకాంత్ దేవులపల్లి, గౌరవ పాస్టర్లు డానియల్, జ్యోతి ప్రకాష్, సుందర్ రావు, దేవానంద్, ప్రభుదాస్, నిర్మల్ కుమార్, జయరాజ్, ప్రేమ్ కుమార్, అమోస్, టోనీ, కుటుంబరావు, నరసింహరావు, మహిళలు భాగ్యలక్ష్మి, సౌజన్య, కళ్యాణి, సుధారాణితో పాటు చర్చి సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామి దేవస్థానంలో అఖండ హనుమాన్ చాలీసా

### సన్మానించిన ఆలయ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్



**నాగారం, జూలై 26 (జనం వార్త) :** శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ షిరిడి సాయిబాబా, అభయాంజనేయ స్వామి దేవస్థానంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. అఖండ హనుమాన్ చాలీసా పారాయణంలో మాజీ చైర్మన్ కౌట్ల చంద్రరెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగారం డివిజన్ పరిధిలోని సత్యనారాయణ కాలనీ శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం ఘనంగా ముగిసిందని ఆలయ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి అనుగ్రహం పొందిన భక్తులకు మాజీ కౌన్సిలర్ అన్నంరాజు లావణ్య శ్రీనివాస్ స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్,కౌన్సిలర్లు, నారగం ఉమా శంకర్ గౌడ్,చిట్యాల శ్రీనివాస్ రెడ్డి,కాలనీ వాసులు పాల్గొన్నారు.



## అక్రమ మైనింగ్‌పై ఉమ్మడి ఉద్యమం

- కలెక్టరేట్ ముట్టడికి గోర్ బంజారా పోరాట సమితి సంపూర్ణ మద్దతు
- జూలై 27న భారీగా తరలిరావాలని వైరా ఇంచార్జ్ గణేష్ నాయక్ పిలుపు

**జూలూరుపాడు :** తోగూడెం గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి వైరా ఇంచార్జ్ గణేష్ నాయక్ డిమాండ్ చేశారు. ప్రకృతి సంపద పరిరక్షణ, గిరిజనుల హక్కుల రక్షణ లక్ష్యంగా సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 27న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) వద్ద నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి భారతీ-య గోర్ బంజారా పోరాట సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. శనివారం జూలూరుపాడు మండల కేంద్రంలో నిర్వహించిన భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్రమ మైనింగ్ కారణంగా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం నష్టపోవడమే కాకుండా అడవులు, కొండలు, నీటి వనరులు, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు కొనసాగడం వల్ల భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అక్రమ మైనింగ్‌పై ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత శాఖలు ఆశించిన స్థాయిలో స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గతంలో మైనింగ్ శాఖ అధికారులు క్వారీలను సీజ్ చేసినట్లు ప్రకటించిన నేపథ్యంలో, తిరిగి అక్కడే కార్యకలాపాలు ఎలా ప్రారంభమయ్యాయనే అంశంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జూలై 27న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడికి భారతీయ గోర్ బంజారా పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేస్తారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల గౌరవ అధ్యక్షుడు నరసింహారావు నాయక్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు నాయక్, జగ్గయ్య నాయక్, బానోత్ రవి, బాదావత్ వీరు నాయక్, తేజావత్ నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## పరిమళనగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**ఉప్పల్/ ఏఎస్‌రావు నగర్ :** కాప్రా సర్కిల్ పరిధిలోని ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిమళ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా గణపతి రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆనంద్ రాజ్, గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా వినోద్ కుమార్, శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నాగ మల్లేశ్వర రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, కోశాధికారిగా హేమంత్ కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు గణపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని తెలిపారు. తమపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు.




## కార్గిల్ అమరవీరులకు నివాళి

**ఉప్పల్/ ఏఎస్‌రావు నగర్ :** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ జై జవాన్ కాలనీలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికులు, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సాయంత్రం 7 గంటలకు జై జవాన్ కాలనీ రీడింగ్ రూమ్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో వివిధ కాలనీలకు చెందిన ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చేతుల్లో కొవ్వొత్తులు, జాతీయ పతాకాలతో దేశభక్తి నినాదాలు చేస్తూ అమరవీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, కాంగ్రెస్ నాయకులు, వివిధ కాలనీల వాసులు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# పరగడుపునే గోరు వెచ్చని నీటిని తాగుతున్నారా..?

## ఈ విషయాలను తెలుసుకోవాల్సిందే..!

**నీరు మన శరీరానికి ఎంతో అవసరమన్న సంగతి మనందరికీ తెలిసిందే. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియకు, రక్తప్రసరణకు, జీర్ణవ్యవస్థ సక్రమంగా పని చేయడానికి, శరీర జీవక్రియలకు నీరు ఎంతో అవసరం. రోజు 8 నుండి 9 గ్లాసుల నీటిని తప్పకుండా మనం తాగాల్సిందే. అలాగే రోజూ మనం నీటిని తాగుతున్నప్పటికీ ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల మనకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయి. ఇలా గోరు వెచ్చని నీటిని ఉదయం పూట తాగడం అందరికీ అలవాటుగా మారుతుందని కూడా చెప్పవచ్చు. ఉదయం పూట నీటిని తాగడం వల్ల అజీర్తి సమస్య తగ్గుతుందని చాలా మంది భావిస్తుంటారు. అయితే ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల నిజంగానే అజీర్ణ సమస్య తగ్గుతుందా.. ఇలా నీటిని తీసుకోవడం వల్ల శరీరానికి మేలు కలుగుతుందా.. ఇది అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందా.. దీని గురించి వైద్యులు ఏమంటున్నారో.. తెలుసుకుందాం.**

ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల జీర్ణక్రియకు సహజ ఉద్దీపనగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల ఆహారం సమర్థవంతంగా విచ్ఛినం అవుతుంది. గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల పేగులకు రక్తప్రవాహం పెరుగుతుంది. జీర్ణక్రియ వేగంగా జరుగుతుంది. గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. కనుక ఉదయం పూట గోరువెచ్చని నీటిని తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు తెలియజేస్తున్నారు. అయితే మనం నీటిని తీసుకునే ఉష్ణోగ్రత, సమయం కూడా వీటిపై ఆధారపడి ఉంటాయని వారు చెబుతున్నారు. 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కలిగిన నీటిని పొట్ట చలనశీలత కోసం తీసుకోవడం మంచిది. 50 నుండి 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కలిగిన నీటిని గ్యాస్, ఉబ్బరం, అజీర్తి వంటి లక్షణాలను తగ్గించడానికి తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. కనుక ఉదయం తాగే నీరు 50 డిగ్రీల నుండి 60 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మధ్య ఉండేలా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### కిడ్నీల ఆరోగ్యానికి..

ఇక ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తీసుకోవడం వల్ల మనం తీసుకునే అల్పాహారం మరింత సమర్థవంతంగా విచ్ఛినం అవుతుంది. ఆమ్లత్వం తగ్గుతుంది. ఖాళీ కడుపుతో నీటిని తాగడం వల్ల ప్రేగు కదలికలు ఎక్కువగా ఉంటాయి. దీంతో మలబద్దకం సమస్య తగ్గుతుంది. గోరువెచ్చని నీటిని తాగడం వల్ల మూత్రపిండాలు వ్యర్థాలను సమర్థవంతంగా బయటకు పంపిస్తాయి. శరీరంలో డిటాక్సిఫికేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతుంది. అంతేకాకుండా వేడి నీటిని తాగడం వల్ల రక్తప్రసరణ మెరుగుపడుతుంది. అవయవాలకు ఆక్సిజన్ మరింత సమర్థవంతంగా అందుతుంది. వేడి నీటిని తాగడం వల్ల మనం సులభంగా బరువు కూడా తగ్గవచ్చు. ఉదయం పూట గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల శరీరంలో జీవక్రియల వేగం పెరుగుతుంది. నిల్వ ఉన్న కొవ్వు వేగంగా కరుగుతుంది. క్యాలరీలు ఎక్కువగా ఖర్చు అవుతాయి. తద్వారా మనం వేగంగా బరువు తగ్గవచ్చు.

### బాగా వేడిగా ఉన్న నీటిని తాగితే..

ఉదయం పూట వేడి నీటిని తాగడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మనం తాగే నీరు 60 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ వేడి లేకుండా చూసుకోవాలి. ఎక్కువ వేడి ఉన్న నీటిని తాగడం వల్ల నాలుక సున్నితమైన పొర దెబ్బతింటుంది. దంతాలపైఉండే ఎనామిల్ కాలక్రమేణా బలహీనపడుతుంది. వేడి నీరు కొందరిలో యాసిడ్ రిఫ్లెక్స్ ను పెంచుతుంది. అంతేకాకుండా వేడి నీటిని తాగడం వల్ల గొంతు చికాకు, బొంగురు గొంతు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంది. ఖాళీ కడుపుతో తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తాగడం వల్ల రక్తంలో సోడియం స్థాయిలు పలుచగా అవుతాయి. దీంతో వికారం, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి. ఉదయం పూట గోరు వెచ్చని నీరు తాగడం వల్ల శరీరానికి, జీర్ణ వ్యవస్థకు మంచిదే అయినప్పటికీ నీటిని తాగడం వల్ల కలిగే దుష్ప్రభావాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.



# కుచేలోపాఖ్యానం

అవనీపతి పరీక్షిత్తు తపోధన్యాగ్రణి శుకునితో.. 'మహామునీ! నళినీ (పద్మ) దళలోచనుని అనితర వీర్యగుణ సంపదలు అనంతాలు. వాని గురించి వేమారు- పలుమారులు ఎంతగా విని ఉన్నా స్వాంతా- చిత్తానికి తనవి తీరదు. ఎంతటి ఇంద్రియలోలుడైనా ఇందీవరుని అరవిందనేత్రుని- ముకుందుని దివ్య కథా వైభవాన్ని ఒక్కమారు విన్నా అతను తన ఐహిక సుఖాసక్తిని పోనిడి- మాని దేవదేవుని యందు భక్తి తత్పరతని పొంది తీరుతాడు. భగవత్కథ ఎంత విన్నా తృప్తి కలుగదు. ఇది భగవంతుని తోటి నిత్య వియోగం. కాని, కథ వింటుంటే ఎంతో ఆనందం, ఇది స్వామితోటి నిత్య సంయోగం. అదీగాక, పరమాత్ముని విషయంలో ప్రవర్తించే ఇంద్రియాలే సార్థకాలు. ఇతరాలు అనర్థకాలు- వ్యర్థాలు..

చ॥ 'హరి భజియించు హస్తములు హస్తము, లచ్యుతు గోరి మ్రొక్కు త
చ్ఛిరము శిరంబు, చక్రధరు జేరిన చిత్తము చిత్త, మిందిరా
వరుగను దృష్టి దృష్టి, మురవైరి నుతించిన వాణి వాణి, య
క్షరుకథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుబో భువిన్'

'మునీంద్రా! గజేంద్ర వరదుని- కృష్ణుని భజించే- సేవించే హస్తాలే హస్తాలు. భక్తితో భుజగేంద్ర శయనుని- అచ్యుతుని అంఘ్రి (పాద) పద్మాలకు ప్రణమిల్లే శిరసే శిరస్సు. ఆ మాధవుని యందు మగ్నమైన మనసే మనస్సు. మందరగిరి ధరుని, ఇందీవరశ్యాముని- గోవిందుని సుందర రూపాన్ని దర్శించే కన్నులే కన్నులు. ఆ కరుణాలవాలుని కీర్తించే నాలుకే నాలుక. మార జనకుని, వ్యాల- కాళియ మర్దనుని లీలలను పారవశ్యంతో ఆలకించే వీనులే- చెవులే వీనులు. కావున, మునివరా! ఆ పరమేశ్వరుని కనీవినీ ఎరుగని కరమరుదైన అశేష లీలా విశేషాలను గూర్చి ఇంకనూ నాకు వివరించు' అని కోరగా హరి పాదపద్మాసక్తుడైన బాదరాయణి- వేదవ్యాస తనయుడైన శుకయోగి ఇలా నివేదించాడు..

సీ॥ 'అనుడు వేదవ్యాస తనయుడా యభిమన్యు
తనయుని జూచి యిట్లనియె బ్రీతి
జనవర! గోవింద సఖుడు కుచేలుండు
నా నొప్పు విప్రుండు మానధనుడు
విజ్ఞాని రాగాదివిరహిత స్వాంతుండు
శాంతుండు ధర్మ వత్సలుడు ఘనుడు
విజితేంద్రియుడు బ్రహ్మవేత్త దారిద్ర్యంబు
బాధింప నొరుల గార్పణ్యవృత్తి
తే॥ నడుగ బోవక తనకు దానబ్బినట్టి
కాసు పదివేల నిష్కముల్గా దలంచి
యాత్మ మోదించి పుత్రదారాభిరక్ష
యొక విధంబున నడుపుచు నుండునంత'

నరేంద్రా! పూర్వం గోవింద సఖుడు- కృష్ణుని బాల్యమిత్రుడు- కుచేలుడు అనే భాసురుడైన- జ్ఞాన వైరాగ్యాలతో విరాజిల్లు, భూసురుడు ఉండేవాడు. అతడు మిక్కిలి స్వాభిమాని, గొప్ప విజ్ఞాని. రాగద్వేషాలు లేనివాడు. పరమశాంతికి ఖని- గని. (శాస్త్రాలన్నిటికి శమము- అంతరింద్రియ నిగ్రహమే చరమ ప్రయోజనం. కాన, ఎవని ఉల్లము- మనసు ఎల్లవేళలా ప్రసాద గుణ భూయిష్ఠంగా- చల్లగా, ప్రశాంతి నిలయంగా ఉంటుందో, వాడే సర్వశాస్త్ర పారంగతుడు'). అతడు ధర్మవత్సలుడు- చక్కని ధర్మనిరతి



గల యతి సమానుడు, జితేంద్రియుడు. బ్రహ్మరతి గలవాడు- ఆత్మజ్ఞాని. అతి నిర్ధనుడు. అయినా ఎంతో ధృతి- ధైర్యం గలవాడు. సంగ్రహం- ధన సంచయం, ప్రతిగ్రహం- దాన స్వీకరణం చెయ్యక ప్రారబ్ధ ప్రాప్తంతో తృప్తి పడతాడు. దీనమతియై ఎవ్వరినీ ఏమీ యాచించడు.

అయాచితంగా ప్రాప్తించిన కాసు- కానినే పదివేల ధనరాశిగా తలుస్తూ, దానితోనే ఏదో విధంగా భార్యాపుత్రులను సాకుతూ వాసికెక్కినవాడు. (సఖుడు- 'సహ ఖ్యాయతే ఇతి సఖా' రామలక్ష్మణులు, కృష్ణార్జునుల వలె కృష్ణ కుచేలులు- సమానమైన ఖ్యాతి కలవారు). జితేంద్రియుడు- పంచ జ్ఞానేంద్రియాల అనుభవం పొందుతూ కూడా, ఎందునా- అనగా వింటూ, తాకుతూ, కంటూ, తింటూ, మూచూస్తూ- వాసన చూసియూ సంతోషం కాని, దుఃఖం కాని పొందనివాడు. పరధన విషయంలో ఎవడు అంధుడో, పరనారి విషయంలో ఎవడు నపుంసకుడో, పరవాద (పరనింద) విషయంలో ఎవడు మూగవాడో వాడే జితేంద్రియుడు. ధర్మవత్సలుడు- ధర్మం పట్ల విముఖుడు ఎంత బలవంతుడైనా సాంతం- పూర్తిగా దుర్బలుడే, ఎంత ధనవంతుడైనా ధనహీనుడే, ఎంత జ్ఞానవంతుడైనా అజ్ఞాని- మూర్ఖుడే. ఒక్కొక్కడు దరిద్రుడైనా దామోదరునికి దూరం కాడు.

నిజానికి అచ్యుతుడు అకించన- నిరుపేద ప్రియుడు. కుచేలుడు తపశ్శాలియైన దరిద్రుడు. ఆత్మజ్ఞాని నిర్ధనుడైనా సదా సంతృప్తుడై ఉంటాడు. ఎవరితోడూ లేకున్నా అతడు మహాబలవంతుడే. భుజింపకున్నా ఆత్మరసంచే నిత్యతృప్తుడుగానే ఉంటాడు. సర్వత్ర- అంతటా సమదృష్టితో ఉంటాడు కాన, ఆయనకు జోడు- సమానుడు ఎవ్వడూ ఉండడు (ఆదిశంకరులు). ఇలా 'జ్ఞానీ భక్తుడు' కనుకనే కుచేలుడు కృష్ణునికి అత్యంత ప్రియుడు. దారిద్ర్యానికి పరాకాష్ఠ యాచనే కాని నిర్ధనత్వం- బీదరికం కాదు. పరమేశ్వరుడు శంకరుడు కౌపీనధారి- గోచిపాతరాయుడైనా 'పరమేశ్వరుడు' అని లోకంలో ప్రసిద్ధమే కదా! ఇన్నీ మరిన్నీ విశేషాలను వివరించే పేరెన్నికగన్న గాథయే 'కుచేలోపాఖ్యానం'.

అసలు సిసలైన 'సఖ్యభక్తి'కి అపూర్వ ఉజ్జ్వల ఉదాహరణ. భాగవతం దశమ స్కంధంలో రెండు ప్రసంగాలలో అసంగుడైన శుకయోగికి 'భావ సమాధి' కలిగిందని ఆచార్యవాణి. మొదటిది గోవత్స అపహరణ లీల కాగా, రెండవది ఈ కుచేలోపాఖ్యానం. ఈ ఉపాఖ్యానంలో పోతన భగవత్ భాగవతుల మధ్య నెలకొన్న అవినాభావ, ప్రగాఢ, అనిర్వచనీయ, సమున్నత బంధాన్ని, సంబంధాన్ని, అనుబంధాన్ని రసభావ బంధురంగా అనుభవపూర్వకంగా రూఢిగా రూపించాడు.

'కుచేలుడు' అనేది గౌణనామం. చేలము అనగా వస్త్రం. కుచేలుడనగా జీర్ణమైన- చినిగిన, మలిన వస్త్రం ధరించిన వాడు. ఇది అక్షరార్థమే కాని పురాణ పరమార్థం మాత్రం ఇది కాదు. ఇక్కడ చేలం- వస్త్రమనగా అజ్ఞానమనే ఆవరణకు ప్రతీకం- సంకేతం. వస్త్రం దేహాన్ని ఆవరించునట్లు అజ్ఞానం జ్ఞానాన్ని- ఆత్మ స్వరూపాన్ని ఆవరిస్తుంది (మరుగు పరుస్తుంది)- 'అజ్ఞానేన ఆవృతం జ్ఞానం' అని కదా గీత. 'జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశిత మాత్మనః'.. (గీత). బ్రహ్మజ్ఞానం అనే కత్తితో అజ్ఞానమనే వస్త్రాన్ని జీర్ణం శీర్ణం గావించిన- అనగా బొత్తిగా చించి పడేసినవాడు కుచేలుడు. కనుకనే బ్రహ్మ విద్వరుడు- బ్రహ్మవేత్తలలో ఉత్తముడు, శ్రేష్ఠుడు.

మరోవిధంగా.. 'వాసాంసి జీర్ణాని యథా విహాయ' (గీత)- విశీర్ణమయ్యే- కృశించి, నశించి పొయ్యే శరీరమే జీర్ణవస్త్రం. ఎంతగా పోషించి రక్షించినా ఏదో ఒకనాడు వల్లకాటికి ఆహుతి అయ్యేదే! దహింపబడేది కాన, దేహం. ఒడలు చినిగి- సడలి సన్నగిల్లి వెడలిపొయ్యేది కాన శరీరం. ఇదే కుచేలం. ఈ దృష్టితో లోకంలోని వారంతా కుచేలులే. కాని, ఈ సత్యం గ్రహించి నిత్యం తదనుగుణంగా వర్తించే- జీవించే వారెందరు? 'మనుష్యాణాం సహస్రేషు కశ్చిత్' అన్నట్లు కుచేలుని వంటి మహాత్ముడు అత్యంత దుర్లభుడు.

సీ॥ 'లలిత పతివ్రతా తిలకంబు వంశాభి
జాత్య తద్భార్య దుస్సహదరిద్ర
పీడచే గడునొచ్చి పెదవులు దడుపుచు
శిశువులాకటి చిచ్చుచే గృశించి
మలమల మాడుచు మానసం బెరియంగ
బట్టె డోరెము మాకు బెట్టు మనుచు
బత్త్ర భాజనధృత పాణులై తను జేరి
వేడిన వీనుల సూడినట్ల'
తే॥ 'యైన నొకనాడు వగచి నిజాధినాథు
జేరి యిట్లని పలికె నో జీవితేశ
తట్టు ముట్టాడు నిట్టి పేదటిక మిట్లు
నొంప దీని కుపాయ మూహింప వైతి'

శుకుడు- రాజా! కుచేలుని ధర్మపత్ని (వామాక్షి) మహా పతివ్రత. సద్వంశమున పుట్టినది. తిండిలేక కృశించిన పిల్లలు ఆకలి చిచ్చుకు తాళలేక, ఎండిన పెదవులను నాలుక- లాలాజలంతో తడుపుకొంటూ మలమల మాడుచున్న డొక్కలతో, చేతుల్లో ఆకులూ, గిన్నెలూ పట్టుకొని కన్నతల్లి వద్దకొచ్చి 'అమ్మా! ఆకలేస్తోందే! పట్టెడన్నం పెట్టవే' అని వేడికొనగా తట్టుకోలేక మిక్కిలి నొచ్చుకొని ఆ తల్లి తల్లడిల్లిపోయింది. భరించడం తనవల్ల కాక ఆ ఇల్లాలు ఒకనాడు భర్తతో.. నాథా! తట్టుముట్టాడు- మిక్కుటమైన పేదరికం ఇంట్లో విలయతాండవం చేస్తోంది. ఈ బాధనుంచి బయటపడే ఏదైనా ఉపాయం ఆలోచించండి' అని ఆవేదనతో పలికింది. ఆ ఇంతి- స్త్రీ తన కాంతునితో ఇంకా ఇలా అన్నది- మహాత్మా! అఖిల లోకారాధ్యుడు శ్రీకృష్ణుడు మీకు బాల్య సఖుడు గదా! ఆ మహానుభావుణ్ని ఒక్కసారి దర్శించండి. అతని అక్కటికం- దయ అనే సూర్య ప్రకాశం పొంది కటిక పేదరికమనే చిమ్మ చీకటిలో మగ్గుతున్న మమ్ము ఉద్ధరించండి.

చ॥ 'వరదుడు సాధు భక్తజన వత్సలు డార్తశరణ్యు డిందిరా
వరుడు దయోపయోధి భగవంతుడు కృష్ణుడు దా గుశస్థలీ
పురమున యాదవ ప్రకరముల్ భజయింపగ నున్నవాడు, నీ
వరిగిన నిన్ను జూచి విభుడప్పుడ యిచ్చు ననూన సంపదల్'

స్వామీ! అమర ప్రభువు మురహరుడు వరములనిచ్చు మేటి దేవర. భగవంతుడు భక్తవత్సలుడు. శ్రీపతి తన్ను ఆశ్రయించిన ఆర్తులను ఆదుకొనువాడు. వాసుదేవుడు దాసులపై ఆశించిన దాని కన్నా మిన్నగా దయ చూపువాడు. యాదవులు తన్ను సాదరంగా సేవిస్తుండగా ఆ మాధవుడు ప్రస్తుతం ద్వారకలో ఉన్నాడు. నాథా! ఆ జగన్నాథుని ఒక్కసారి చూచిరండి. ఆ కృపాసాగరుడు మిమ్ములను చూస్తే చాలు. వెంటనే మీకు అపార సంపదలు అనుగ్రహిస్తాడు.

మ॥ 'కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముడైనట్టి దు
ర్బలు డాపత్సమయంబునన్ నిజ పదా బ్జాతంబు లుల్లంబులో
దలపన్నంతన మెచ్చి యార్తి హరుడై తన్నైన నిచ్చున్, సుని
శ్చల భక్తిన్ భజియించువారి కిడడే సంపద్విశేషోన్నతుల్'

మున్ను ఎన్నడూ తన్ను- వెన్నుని, కలలో కూడా తలవని- స్మరించని బలహీనుడు పాపాత్ముడు కూడా ఆపన్నుడై- ఆపదలపాలై, ఖిన్నుడై (దుఃఖిస్తూ) ఆ సంకటస్థితిలో ఒక్కసారి ఆ భక్తజన మందారుని- కృష్ణుని పాదారవిందాలను మనసా తలచుకున్న చాలు, అట్టివానిని కూడా ఆ శ్రీహరి కనికరిస్తాడు. మెచ్చుకొని అతనికి తన్నుతానే అర్పించు- ఇచ్చుకుంటాడు. అంతటి ప్రసన్నాత్ముడు భక్తితో తన్ను సేవించేవారికి వెన్ను తట్టి మరీ క్రన్నన- శీఘ్రంగా సకల సంపదలు ఇయ్యకుండా ఉంటాడా?



# మీ బండికి ఇన్సూరెన్స్ ఉందా?

**రోడ్డుపై వాహనం తిరగాలంటే కచ్చితంగా బీమా ఉండాల్సిందే. కానీ, ఇటీవలి నివేదికల ప్రకారం చూస్తే..అధిక శాతం వాహనాలకు ముఖ్యంగా ద్విచక్ర వాహనాలకు బీమా పాలసీ ఉండటమే లేదు. బీమా లేకుండా రోడ్డుపైకి వచ్చే వాహనాలకు జరిమానా విధించాలని ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయి. ఇప్పటికే ఇది అమలవుతున్నా, కాస్త కఠినంగా వ్యవహరించాలని అనుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో మీ బండికి బీమా ఉందా లేదా ఒకసారి పరిశీలించండి.**

## వైవిధ్యంగా పెట్టుబడులు

ఈక్విటీలు, బంగారం, డెట్ పథకాల్లో మదుపు చేయాలని భావించే వారిని లక్ష్యంగా చేసుకొని, ఎడిల్‌వైజ్ మ్యూచువల్ ఫండ్ సరికొత్త ఫండ్‌ను తీసుకొచ్చింది. ఎడిల్‌వైజ్ మల్టీ అసెట్ ఓమ్ని ఫండ్ ఆఫ్ ఫండ్ అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 26 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. ఈక్విటీ, డెట్, గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లలో వైవిధ్యంగా మదుపు చేయడం ద్వారా పెట్టుబడిదారులకు బహుళ పెట్టుబడి అవకాశాలను కల్పిస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, ఆయా విభాగాల్లో పెట్టుబడి నిష్పత్తిని మారుస్తూ ఉంటుంది. ఈ విధానం వల్ల ఒకే విభాగంపై ఆధారపడకుండా చూసుకుంటుంది. నష్టభయం భరించగలిగి, 5-7 ఏళ్లపాటు కొనసాగే దీర్ఘకాలిక మదుపరులకు ఇది అనుకూలం. మల్టీ అసెట్ వ్యూహంతో ఒకే ఫండ్‌లో వివిధ విభాగాల్లో మదుపు చేయాలనుకునే వారూ పరిశీలించవచ్చు.

## అధిక రాబడి ఆర్జించేలా

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ ఒక వినూత్న పథకాన్ని తీసుకొచ్చింది. డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీక్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ పేరుతో వచ్చిన ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 22 వరకూ అందుబాటులో ఉంటుంది. కనీస పెట్టుబడి రూ.100. నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్‌ను ప్రామాణికంగా తీసుకుంటుంది. అధిక రిటర్న్ ఆన్ ఈక్విటీ (ఆర్‌ఓఈ), తక్కువ అప్పులు, స్థిరమైన ఆదాయ వృద్ధి వంటి నాణ్యతా ప్రమాణాల ఆధారంగా కంపెనీలను ఎంపిక చేస్తుంది. మార్కెట్ పరిస్థితులను బట్టి, లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్‌లలో పెట్టుబడి నిష్పత్తిని మార్చుకుంటూ వెళ్తుంది. తొలిసారిగా ఫ్లెక్సీక్యాప్, క్వాలిటీ రెండింటినీ కలిపిన వ్యూహంతో వచ్చింది. దీర్ఘకాలిక లక్ష్యాలు, నష్టభయం భరించగలిగే వారికి అనుకూలం. ప్రత్యేక వ్యూహంతో నష్టభయాన్ని పరిమితం చేస్తూ, అనేక రకాల వ్యూహాలతో పనిచేస్తున్న ఈటీఎఫ్‌లలో మదుపు చేసే వ్యూహంతో మిరే అసెట్ మ్యూచువల్ ఫండ్ ఒక కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. మిరే అసెట్ మల్టీ ఫ్యాక్టర్ పాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ అనే ఈ పథకం ఎన్‌ఎఫ్‌ఓ ఈ నెల 25 వరకూ కొనసాగుతుంది. కనీస పెట్టుబడి రూ.5,000. వాల్యూ, గ్రోత్, క్వాలిటీ, మొమెంటమ్‌లాంటి వాటి ఆధారంగా పనిచేసే ఈటీఎఫ్‌లను ఎంచుకొని, వాటిలో మదుపు చేస్తుంది.




### సున్నా తరుగుదల:

ద్విచక్ర వాహన బీమా పాలసీలో ముఖ్యమైన రైడర్లలో ఇదొకటి. ప్రమాదంలో దెబ్బతిన్న భాగాల విలువకు సమానమైన మొత్తాన్ని అందుకుంటారు. ఈ యాడ్-ఆన్ లేకపోతే ప్రతి భాగంపై తరుగుదల లెక్కించి, ఆ మేరకే బీమా సంస్థ చెల్లిస్తుంది. మిగతా మొత్తాన్ని చేతి నుంచి భరించాల్సి వస్తుంది.

**ఇంజిన్‌కు రక్షణ:** ఇంజిన్ అంతర్గత భాగాలు దెబ్బతిన్నప్పుడు ఇది ఉపయోగప డుతుంది. వరదల్లో వాహనం చిక్కుకున్నప్పుడు ఇంజిన్ పాడయ్యే అవకాశం ఉంటుంది. ఇలాంటప్పుడు ఈ అనుబంధ పాలసీ ఉపయోగపడుతుంది. టైర్లకు నష్టం వాటిల్లినప్పుడు టైర్ ప్రొటెక్టర్ పాలసీ సైతం అందుబాటులో ఉంటుంది.

### వాహనం ఆగితే సాయం:

ప్రమాదం లేదా వాహనం చెడిపోవడంలాంటి సందర్భాల్లో వాహనం రోడ్డుపైనే ఆగిపోతుంది. ఇలాంటప్పుడు సాయం చేసేందుకు రోడ్ సైడ్ అసిస్టెన్స్ రైడర్ ఉపయోగపడుతుంది. వాహనం పాడైన సందర్భంలో నట్లు, బోల్టులు, ఇంజిన్ ఆయిల్ లాంటి వాటికోసం చేసిన ఖర్చులనూ తిరిగి పొందేందుకు కన్జ్యూమబుల్ యాడ్-ఆన్ పాలసీ తీసుకోవచ్చు. మనం ఎంత సురక్షితంగా వాహనాన్ని నడిపినా.. అనుకోకుండా ప్రమాదాల బారిన పడే సందర్భాలుంటాయి. ఇలాంటి వాటికి ఆర్థికంగా సన్నద్ధం కావడం ముఖ్యం. అదే సమయంలో చట్టపరమైన బాధ్యతనూ నెరవేర్చడంలోనూ బీమా పాలసీ తోడ్పడుతుంది. కాబట్టి, మీ వాహనానికి ఎప్పుడూ సమగ్ర వాహన బీమా పాలసీ ఉండేలా చూసుకోండి. రోడ్డు మీద ధీమాగా ఉండండి.

మోటారు వాహనాల వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రమాదాలూ అదే స్థాయిలో నమోదవుతున్నాయి. ఈ సందర్భాల్లో బండి దెబ్బతినడం, వాహనాదారుడికి గాయాలు కావడం, కొన్నిసార్లు మరణాలూ సంభవిస్తుంటాయి. ప్రయాణంలో జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. దీంతోపాటు అనుకోని ప్రమాదంలో ఆర్థిక భారం లేకుండా ఉండేందుకు మోటార్ వాహన బీమా కూడా ఉండాలి. భారతీయ మోటారు వాహన చట్టం ప్రకారం రోడ్డుపై తిరిగే ప్రతి వాహనానికి కనీసం థర్డ్ పార్టీ బీమా తప్పనిసరి. ఇది లేకుండా వాహనాన్ని బహిరంగ ప్రదేశాల్లో ఉపయోగించడం నేరం. లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్, బీమా, ఇతర అవసరమైన పత్రాలు లేకుండా వాహనం తీయకూడదు. వాహనం ద్వారా మూడో పక్షానికి (థర్డ్ పార్టీ.. వాహనం, వాహనాన్ని నడిపే వ్యక్తి కాకుండా ఇతరులు) ఏదైనా నష్టం వాటిల్లినప్పుడు పరిహారం ఇచ్చేది థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్. దీన్ని లయబిలిటీ ఓన్లీ పాలసీగానూ పిలుస్తారు. విస్తృత బీమా ప్రయోజనాన్ని కల్పించేది సమగ్ర ద్విచక్ర వాహన బీమా. ప్రమాదం, దొంగతనం, వరదలు, అగ్నిప్రమాదం, ప్రకృతి వైపరీత్యాలు, తదితర వాటి వల్ల నష్టానికి పరిహారం ఇవ్వడంతోపాటు, థర్డ్ పార్టీకి వాటిల్లిన నష్టాన్నీ ఇది భర్తీ చేస్తుంది. సమగ్ర బీమా పాలసీకి కొన్ని అనుబంధ పాలసీలనూ జోడించుకునే అవకాశం ఉంది. వీటిని రైడర్లుగా పిలుస్తారు.



# నకిలీ ఏజెంట్లతో జాగ్రత్త..

## బీమా సంస్థల హెచ్చరిక

**ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరకు వస్తుండటంతో పలు పెట్టుబడి పథకాల్లో మదుపు చేసే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే బీమా పాలసీలు తీసుకోవాల్సిందిగా చెబుతూ నకిలీ ఏజెంట్లూ పుట్టుకొస్తున్నారు. వీరి విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని బీమా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. వీరిని గుర్తించేందుకు కొన్ని సూచనలూ చేస్తున్నాయి.**

- తక్కువ ప్రీమియం చెల్లించినా చాలు.. భవిష్యత్తులో మంచి లాభాలు వస్తాయని చెబుతూ పాలసీలను అంటగట్టాలని చూస్తుంటారు. ప్రత్యేక రాయితీలు, మంచి లాభాలు అంటూ ఆకర్షించే మాటలు చెబుతుంటారు. ఇది మోసం చేసే ప్రయత్నమే. బీమా కంపెనీలు ఎప్పుడూ అధిక రాబడికి హామీ ఇవ్వవు అనేది గుర్తుంచుకోవాలి.
- బీమా పాలసీలు తీసుకున్నప్పుడు ప్రీమియం మొత్తాన్ని కచ్చితంగా ఆన్‌లైన్ వేదికల ద్వారా లేదా చెక్కు రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. అదీ సంబంధిత కంపెనీ పేరుమీదే. ఇలా కాకుండా నగదుగా ఇవ్వాలని, వ్యక్తిగత ఖాతాలోకి డబ్బు పంపాలని అంటున్నారంటే అది కచ్చితంగా మోసమే. కంపెనీ అధీకృత ఖాతాలోనే ఎప్పుడూ ప్రీమియం జమ చేయాలి.
- ఇప్పుడున్న డిజిటల్ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సామాజిక వేదికపై తమ గుర్తింపును తెలియజేయాలని, తద్వారా తమ వ్యాపారాన్ని పెంచుకోవాలని చూస్తుంటారు. ఇలాంటివి ఏమీ లేకుండా ఉన్నారంటే ఆ ఏజెంట్లను అనుమానించాల్సిందే.
- ఈ రోజే ఈ పాలసీ ముగుస్తుంది.. ఇప్పుడు చెల్లిస్తేనే ఈ ప్రీమియం వర్తిస్తుంది.. లేకపోతే




అవకాశం కోల్పోతారు.. ఇలాంటి మాటలు నకిలీ ఏజెంట్లే చెబుతారు. బీమా పాలసీ తీసుకునేందుకు నిర్ణీత గడువు అంటూ ఏమీ ఉండదు. ఏవో కొన్ని పాలసీలకే ఇది వర్తిస్తుంది. బీమా సంస్థ, పాలసీ పేరు, ఇతర వివరాలను తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రీమియం చెల్లించకూడదు.
- బీమా సంస్థ వెబ్‌సైట్, సహాయ కేంద్రంలో పాలసీలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోండి. తర్వాతే పాలసీ తీసుకోండి.

జనం వార్త



సమాచారం పంచుకునేందుకు ఒకప్పుడు పావురాలతో లేఖలు పంపించుకునేవారు. తర్వాత తపాలా వ్యవస్థ.. మరి ఇప్పుడు ? సామాజిక మాధ్యమాలు.. సోషల్ మీడియా అంతా ఒకెత్తయితే వాట్సాప్ ఒక్కటి ఒక్కెత్తు... అందులో స్టేటస్ అయితే చెప్పనవసరం లేదు. వందలో తొంబై మంది పని ఉదయం లేవగానే వాట్సాప్ స్టేటస్లు చెక్ చేయడం, పోస్ట్ చేయడం... సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి సోషల్ మీడియా ఇప్పుడొక వేదికగా మారింది. అందులో ఇటీవల కాలంలో వాట్సాప్ యాప్ లోని ఫీచర్ అయిన స్టేటస్ ను ఉపయోగించుకుంటున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఆధునిక టెక్నాలజీకి అలవాటు పడ్డ ఈ తరుణంలో స్టేటస్లో పోస్టు పెట్టడమనేది ఒక స్టేటస్ భావిస్తున్నవారూ ఉన్నారు. ఫేస్బుక్, యూట్యూబ్, ఎక్స్ మాధ్యమాలు ఉన్నప్పటికీ ఎక్కువగా వాట్సాఫ్ స్టేటస్ వేదికగా వాడుకుంటున్నారు.





# నేనూ.. నా స్టేటస్

- వాట్సాప్ స్టేటస్ మనోభావాలు వ్యక్తీకరణ
- అక్కడే సూక్తులు.. పరోక్షంగా విమర్శనాస్త్రాలు
- అధిక శాతం భక్తి సంబంధిత విషయాలు పోస్టులు
- వ్యాపార ప్రకటనలకు అదే మార్గం
- వ్యక్తిగత ప్రతిభ చాటి చెప్పేందుకు సైతం...
- స్టేటస్ ను విస్తృతంగా వాడుతున్న ప్రజలు

**మేడ్చల్, నేడు న్యూస్ :** మాట.. పాట.. ఆట.. ఆనందం.. ఆశ్చర్యం.. విషాదం వార్తలు.. విశేషాలు.. వింతలు... శుభాకాంక్షలు.. విమర్శలు.. సూచనలు విద్య, ఉద్యోగం... వ్యాపారం... పుట్టుక.. పెళ్లి.. చావు.. ఆధ్యాత్మికం.. విహారం.. ఆరోగ్యం.. ఇలా అన్నీ ఒకే వేదికపై అందరితో స్మార్ట్ గా పంచుకుంటున్నారు. 'నా స్టేటస్.. నా ఇష్టం'.. అంటూ రోజూ అందరినీ పలకరిస్తూ సాగిపోతున్నారు. ఇలా వారు పెట్టిన పోస్టుకు ఎవరూ స్పందించకపోతే తీవ్ర అసంతృప్తికి గురయ్యే వారూ ఉన్నారు. ఈ క్రమంలో అందుకు అనుగుణమైన సందేశాన్ని కోట్ చేస్తూ పోస్టు చేస్తున్నారు. మొత్తంగా వాట్సాప్ స్టేటస్ లో వారు పోస్టు చేసే దాన్ని బట్టి వారు ఎలాంటి వారు, వారి మనస్తత్వమేమిటో ఇట్టే చెప్పేయవచ్చని మేధావులు అభిప్రాయపడుతున్నారు. వాట్సాప్ స్టేటస్ స్మార్ట్ఫోన్లు వాడుతున్న వారిలో 90 శాతం మందికి స్టేటస్ పెట్టడం దినచర్యలా మారింది. ఒక్కొక్కరు ఒక్కోలా స్టేటస్ పెడుతుంటే మరికొందరు అసలు స్టేటస్ పెట్టకూడదనే కృత నిశ్చయంతో దాన్నే పాటిస్తున్నారు. ఒకరు రోజుకు ఒక స్టేటస్ పెడుతుంటే, మరొకరు జరిగే చిన్న విషయాన్ని అందరితో పంచుకుంటూనే ఉంటారు. మితంగా ఉన్నంత వరకు అన్ని బాగానే ఉంటాయి. అతి కాకుండా అప్రమత్తతతో వ్యవహరించాలని, మానవ సంబంధాలు పెంచుకునేందుకు వాట్సాప్ స్టేటస్ ను ఉపయోగిస్తే సమాజంలో మన స్టేటస్ సైతం పెరుగుతుందనేది నిపుణులు చెబుతున్నారు.




## వాట్సాప్ స్టేటస్ ట్రెండ్

ప్రస్తుతం సమాజంలో నడుసున్న ట్రెండ్ ఏంటో తెలుసా ? బాధొచ్చిందా వాట్సాప్ స్టేటస్, సంతోషం వచ్చిందా వాట్సాప్ స్టేటస్. ఎటైనా ట్రిప్ వెళ్లారా వాట్సాప్ స్టేటస్, ఎవరిపైనా కోపం వచ్చిందా మళ్లీ వాట్సాప్ స్టేటస్. యువత లవ్ బ్రేకప్ అయినా కూడా వాట్సాప్ స్టేటసే స్నేహితుడిలా సాంత్వన కోరుకుంటోంది. వాట్సాప్ ఇంతగా మన జీవితాల్ని పెనవేసుకున్న సమయంలో మంచి చెడుల మిశ్రమంగా సాగుతోన్న స్టేటస్ కథ ఇది. మేడ్చల్ మండలంలో జనాభా దాదాపు లక్ష వరకు ఉంటుంది. అందులో పిల్లలు మినహాయిస్తే 80 వేల వరకు యుక్త వయస్సు నుంచి వృద్ధుల వరకు ఉంటారు. వీరిలో కనీసం 50 శాతం మందికి అంటే 80 వేల మందికి స్మార్ట్ఫోన్లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపుగా స్మార్ట్ఫోన్లు ఉన్న ప్రతి ఒక్కరూ వాట్సాప్ ఉపయోగిస్తున్నారు. వాట్సాప్ లు ఉపయోగించే వారందరూ స్టేటస్లో వారికి నచ్చిన అంశాలను పోస్టు చేస్తూ ఉండటం లేదా చూస్తూ ఉండటం చేస్తున్నారు. ఐదేళ్ల క్రితం వరకు వాట్సాప్ యాప్ ను ఉపయోగించే వారిలో 10 నుంచి 20 శాతం మాత్రమే స్టేటస్ ఫీచరు ఉపయోగించేవారు. ఇప్పుడు 80 శాతం మంది ఈ ఫీచర్ ను చూస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు రోజులో నాలుగైదు సార్లైనా స్టేటస్ చూడంది నిద్రపోవడం లేదని సమాచారం. వారు పెట్టిన పోస్టును ఎవరు ? ఎంత మంది చూశారు ? ఎవ్వరైనా ప్రతి స్పందించారా ? అని అతృతగా వెతికేవారూ అధికమే.




## మనోభావాలు వ్యక్తం చేస్తూ...:

వాట్సాప్ స్టేటస్ మనిషి మానసిక స్థితిని ప్రభావితం చేయడమే కాదు. వ్యక్తి పరిస్థితికి అద్దం పట్టేదిగా మారుతోంది. కొందరు వారి మనోభావాలను తెలియజేసే విషయాలు ఎంపిక చేసుకుని స్టేటస్ లో పోస్టు చేస్తూ ఆనందిస్తున్నారు. ఇవి నచ్చిన వారికి మంచిగా నచ్చని వారికి చెడుగా కనిపించవచ్చు. చాలామంది ప్రతిరోజు దేవుళ్ల స్టేటస్ పెడుతుంటారు. ఒక్కోరోజు ఒక్కో దేవుడికి ప్రత్యేకంగా స్టేటస్ వేదికగా పూజలు చేస్తుంటారు. మనోభావాలు ఏవైనా వెంటనే వాటిని వ్యక్తపరిచేందుకు వాట్సాప్ స్టేటస్ ను ఎంచుకుంటున్నారు. ఏ పండుగైనా, సన్నిహితుల ప్రత్యేక రోజుల్లోనూ వాట్సాప్ స్టేటస్ వేదికవుతోంది. అలాగే ఏదైనా సాధించినప్పుడు మనవాళ్లు ఎవరైనా ప్రతిభ కనబర్చినప్పుడు ఆ విషయాన్ని పదిమందికి చేర్చేందుకు, ప్రతిభకు పట్టం కట్టించేందుకు సైతం వాట్సాప్ స్టేటస్ సాయపడుతోంది. అయితే వాట్సాప్ స్టేటస్ పెట్టడమే హోదాగా భావించే వాళ్లు వారు అనుకున్న రీతిలో లైక్లు, కామెంట్లు రాకుంటే మాత్రం అసంతృప్తికి సైతం గురవుతున్నారు. ఆయా పరిస్థితుల్లో వారి మానసిక స్థితిగతులు బట్టి స్టేటస్ పెడుతున్నారని వ్యక్తిత్వ వికాస నిపుణులు, డాక్టర్లు వివరిస్తున్నారు.

## దేవుళ్లు.. దేవతలు...:




వాట్సాప్ స్టేటస్ చాలా ఉపయోగాలు ఉన్నప్పటికీ 50శాతం మంది ఏ రోజుకు ఆ రోజు సంబంధిత దేవుళ్ల ఫొటోలు, పాటల వీడియోలు పోస్టు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. వీటిని చూసిన ఆదేరకమైన వారు ప్రతిస్పందిస్తూ లైన్లు, కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు ప్రతిస్పందిస్తూ ఓకే తెలిపే చిత్రాలను పోస్టు చేస్తున్నారు. హిందువులు ఆయా రోజు ప్రత్యేకతను బట్టి దేవుళ్ల గురించి పోస్టు పెడుతున్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు అయితే రోజుతో సంబంధం లేకుండా ప్రతిరోజూ వారి మత సంబంధ కోట్స్ పోస్టు చేస్తున్నారు.

## అప్రమత్తత అవసరం..:

బాధ సంతోషమే కాదు... కోపాన్ని సైతం ప్రదర్శిస్తున్నారు. పనిచేసే చోట వ్యక్తులతో, బంధువులతో మనస్పర్థలు వచ్చినా వ్యంగంగా విమర్శనాస్త్రాలు సంధిస్తుంటారు. అంతేగాక విజ్ఞానానికి సంబంధించినవి, రాజకీయానికి సంబంధించిన అంశాలతో పాటు వివిధ అంశాలకు సంబంధించి అవగాహన కల్పించేలా సైతం ఉపయోగిస్తున్నారు. అలాగే వ్యాపార ప్రకటనలకు సైతం వాట్సాప్ స్టేటస్ వేదికవుతోంది. తమ తమ వ్యాపారాలకు సంబంధించిన పోస్టర్లు, లింక్ లతో తెరపైకి వస్తుంటారు నిర్వహకులు. అయితే నిర్వాహకులకు తెలియకుండానే కొన్నిసార్లు సైబర్ నేరగాళ్లు లింక్ల రూపంలో వచ్చే అవకాశం ఉందని, ఫొటోలు మార్ఫింగ్ చేసే అవకాశం ఉందని, కాస్త అప్రమత్తత అవసరమని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

### మీ స్టేటస్ ఇతరులు చూడకుండా ఉండాలంటే..? :

మీరు ఇతరుల వాట్సాప్ స్టేటస్లు చూడాలని అనుకుంటున్నారు అంతవరకు ఓకే. కానీ ఇతరులు ఎవ్వరూ మీ స్టేటస్ చూడకుండా ఉండాలంటే... అప్పుడు ఏం చేస్తారు. దీనికి కూడా ఓ పరిష్కారం ఉంది. మన వాట్సాప్ స్టేటస్ ను గుర్తు తెలియని వ్యక్తులు లేదా అన్ వాంటెడ్ వ్యక్తులు ఎవ్వరూ చూడకుండా ఉండాలంటే.. ముందుగా కాంటాక్ట్ లిస్ట్ నుంచి వారి ఫోన్ నంబర్లను డిలీట్ చేయండి. లేదా వారి నంబర్లను బ్లాక్ చేయండి... అంతే సింపుల్ !





# మూడో టీ20 మనదే..

## జింబాబ్వేతో సిరీస్ క్లీన్‌స్వీప్

హరారె: శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా తొలి టీ20 సిరీస్ సాధించింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన మూడో టీ20లో టీమ్‌ఇండియా 35 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో జింబాబ్వే 157/7 స్కోరుకు పరిమితమైంది. ర్యాన్ బర్ల్ (54; 43 బంతుల్లో 5 ఫోర్లు) ఒక్కడే రాణించాడు. వెస్లీ మద్వీర (28), బెన్ కర్రాన్ (20), డియోన్ మైయర్స్ (19) రన్స్ చేశారు. మిగతా బ్యాటర్లెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 3, యశ్ ఠాకూర్ 2 వికెట్లు పడగొట్టారు. రవి బిష్ణోయ్, అశోక్ శర్మ చెరో వికెట్ తీశారు. అంతకుముందు టాస్ గెలిచి భారత్ బ్యాటింగ్‌కు దిగింది. వైభవ్ సూర్యవంశీ (81; 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సులు) అదరగొట్టాడు. ఇషాన్ కిషన్ (29; 26 బంతుల్లో), శ్రేయస్ అయ్యర్ (27; 18 బంతుల్లో), రింకు సింగ్ (25), తిలక్ వర్మ (11) పరుగులు చేశారు. అభిషేక్ శర్మ (2) విఫలమయ్యాడు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ 2, సికిందర్ రజా, వెస్లీ మద్వీర, ముజరబాని ఒక్కో వికెట్ పడగొట్టారు.

## వైభవ్‌ను ఎలా కాపాడుకోవాలో తెలుసు : ఇషాన్ కిషన్

మైదానం బయట విమర్శల నుంచి యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఎలా కాపాడుకోవాలో టీమిండియా వద్ద స్పష్టమైన ప్లాన్ ఉందని ఇషాన్ కిషన్ వెల్లడించాడు. నిన్న మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "వైభవ్ చాలా స్మార్ట్. ఏం చేస్తున్నాడు, ఎలా బ్యాటింగ్ చేయాలి.. మైదానం బయట ఎలా ఉండాలి అన్న విషయంపై అతడికి స్పష్టమైన అవగాహన ఉంది. అతడికి బయట మిత్ర బృందంలో ఆట మీద నుంచి దృష్టి మళ్లించే చాలా అంశాలు ఉండొచ్చు. నేను అటువంటి నేపథ్యం నుంచే వచ్చాను. క్రికెట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఏ సమయంలో వేటిపై దృష్టిఉంచాలో తెలియాలి. ఈ విషయంలో నేను వైభవ్‌కు సాయపడతాను. అంతేకాదు.. జట్టులో అభిషేక్, అక్షర్, చాలామంది ఇతర ఆటగాళ్లు కూడా అతడికి ఈ విషయం అండగా ఉంటారు. అతడు వీలైనంత క్రికెట్ గురించే ఆలోచించేలా చేస్తాం. సోషల్‌మీడియా, బయట నుంచి వచ్చే విమర్శలు వంటి వాటి ప్రభావానికి లోనుకాకుండా.. తక్కువ స్కోర్ చేసినప్పుడు అతడి బాడీ లాంగ్వేజ్ మారకుండా చూసుకొంటాము. అతడిలాంటి బ్యాటర్ పవర్ ప్లేలోని తొలి ఆరు ఓవర్లు నిలబడి విజృంభిస్తే తేలిగ్గా 90 పరుగుల వరకు రాబట్టవచ్చు. చిన్న వయసులోనే అతడిలా ఆడే క్రీడాకారుడికి ఆట నుంచి దృష్టిమళ్లకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఒక సోదరుడి వలే ఆట, ఫిట్‌నెస్, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవడం వంటి అంశాల్లో సహాయపడతాను" అని ఇషాన్ పేర్కొన్నాడు. నిన్న జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ 81 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. దీనిలో వైభవ్ ఆరంభంలో దూకుడుగా ఆడినా.. 20 పరుగులకే ఔటై పెవిలియన్‌కు చేరుకొన్నాడు.



## కామన్వెల్త్ గేమ్స్..

## వెయిట్ లిఫ్టింగ్‌లో భారత్‌కు రజతం

**గ్లాస్గో:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ ఖాతాలో రెండో పతకం చేరింది. పురుషుల వెయిట్ లిఫ్టింగ్ 60 కేజీల విభాగంలో మణిపూర్ వెయిట్ లిఫ్టర్ రిషికాంత సింగ్ రజత పతకం సాధించాడు. మొత్తం 264 కేజీలు ఎత్తి ఈ కామన్వెల్త్ పోటీల్లో భారత్‌కు తొలి రజత పతకాన్ని అందించాడు. మలేసియాకు చెందిన అనిక్ బిన్ కాస్డాన్ స్వర్ణం, కెన్యాకు చెందిన జోషువా అముంగా కాంస్య పతకాలు నెగ్గారు. తొలుత స్నాచ్ విభాగంలో 121 కేజీలు ఎత్తిన రిషికాంత.. క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో చివరి ప్రయత్నంలో 151 కేజీలు ఎత్తే క్రమంలో విఫలమయ్యాడు. ఈ విభాగంలో మూడు ప్రయత్నాల్లో భాగంగా తొలుత 143 కేజీలు ఎత్తగా, తర్వాతి రెండు ప్రయత్నాల్లో విఫలమయ్యాడు. దీంతో రిషికాంత 264 కేజీల ఎత్తి రెండో స్థానానికి పరిమితమయ్యాడు. స్వర్ణం నెగ్గిన మలేషియా ఆటగాడు అనిక్ బిన్ తొలుత స్నాచ్ విభాగంలో మూడు ప్రయత్నాల్లో భాగంగా గరిష్ఠంగా 121 కేజీలే ఎత్తాడు. రిషికాంత సైతం 121 కేజీలు ఎత్తడంతో భారత్ స్వర్ణంపై ఆశలు పెట్టుకుంది. అయితే దురదృష్టవశాత్తు క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో చివరి ప్రయత్నంలో రిషికాంత విఫలం కావడంతో భారత్ ఆశలు చెదిరిపోయాయి. చివరి ప్రయత్నంలో మలేసియా ఆటగాడు 152 కేజీలు ఎత్తి స్వర్ణం తన ఖాతాలో వేసుకున్నాడు. బర్మింగ్‌హామ్‌లో 2022 కామన్వెల్త్ పోటీల్లో 55 కేజీల విభాగంలో బరిలోకి దిగిన రిషికాంత అప్పుడు పతకం కొట్టకుండానే వెనుదిరిగాడు. అనంతరం 60 కేజీల విభాగానికి మారిపోయాడు. 2025లో అహ్మదాబాద్‌లో జరిగిన కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో 271 కేజీలు ఎత్తిన రిషికాంత.. గోల్డ్ మెడల్ సాధించి జాతీయ రికార్డు నెలకొల్పాడు. దీంతో అంతర్జాతీయ పోటీలకు నేరుగా అర్హత సాధించాడు.




## 2027 ప్రపంచకప్ జట్టుకు భువీ అవసరం: అశ్విన్

టీమ్ ఇండియాలో నాణ్యమైన సీమర్ల కొరత ఉందని మాజీ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ క్రమంలో భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకునే విషయమై బీసీసీఐ పరిశీలించాలని సూచించాడు. ఆర్సీబీ వరుసగా ఐపీఎల్ టైటిల్స్ గెలుచుకోవడంలోనూ అతడి పాత్ర ఉందని గుర్తు చేశాడు. "ప్రస్తుతం మన ఫాస్ట్ బౌలింగ్ పరిస్థితి చూస్తే భువనేశ్వర్ పేరును ఎందుకు పరిశీలించకూడదు అనిపిస్తోంది. భువీ గత రెండు సీజన్లుగా ఫిట్‌గా ఉంటూ ఆర్సీబీకి ఆడాడు. ఆ రెండు సార్లూ ఆ జట్టు టైటిల్స్ గెలిచింది. ఆ జట్టు విజయానికి ప్రధానమైన మూడు కారణాల్లో భువీ ఒకడు. అలా అని అతడిని నేరుగా జట్టులోకి తీసుకోమని చెప్పడం లేదు. ఒక్క అవకాశం ఇచ్చి చూసి.. అప్పుడు నిర్ణయం తీసుకోండి. భువీ బంతిని స్వింగ్ చేయగలడు, డెత్ ఓవర్లు అద్భుతంగా బౌలింగ్ చేయగలడు, బ్యాటింగ్‌లోనూ రాణించగలడు" అని అశ్విన్ అన్నాడు. "ప్రస్తుతం మన బౌలింగ్ దళంలో అనుభవలేమి కనబడుతోంది. గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్ లాంటి వారితో ప్రపంచ కప్ ఆడాలనుకుంటున్నారా? నేను కచ్చితంగా అనుకోను. వీరిలో ఒకరో ఇద్దరో మాత్రమే ప్రపంచ కప్ జట్టులో ఉండొచ్చు. వీరికి తోడు హర్షిత్, బుమ్రాకు భువీ కూడా కలిస్తే.. బౌలింగ్ దళం అనుభవజ్ఞులతో నిండుతుంది. కొత్త ఆటగాళ్లను తయారు చేయడానికి ఈ 12 కీలకమైన నెలలు సమయం కాదు. ఇప్పటికే హర్షిత్‌కు అవకాశం ఇచ్చారు. అతడు ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేయగలడు. బ్రార్, ప్రసిద్ధ్‌కు ఛాన్స్ ఇచ్చారు. వారిని జట్టు నుంచి తొలగించి మరింత మంది కొత్త బౌలర్లను తీసుకొచ్చి చూసే అవకాశం లేదు. ఐదుగురు పేసర్లను ఎంచుకోండి... వారిలో ముగ్గురిని ప్రపంచకప్‌నకు తీసుకెళ్లండి. అందుకే.. భువనేశ్వర్ వంటి వారిపై చర్చించాల్సిన అవసరం ఉంది" అని అశ్విన్ వివరించాడు.



జనం వార్త





# ఇప్పుడు నా డ్రీమ్ రోల్స్ దక్కుతున్నాయి: అదా శర్మ

యంగ్ బ్యూటీ అదా శర్మ 'ది కేరళ స్టోరీ' చిత్రంతో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ సంపాదించుకోవడమే కాకుండా భారీ హిట్ తన ఖాతాలో వేసుకున్నారు. అంతే స్థాయిలో విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఆ తర్వాత 'బస్తర్ ది నక్సల్ స్టోరీ' చేసి ప్రేక్షకులను అలరించారు. ఇక ఇటీవల 'గవర్నర్'తో మెప్పించిన ఆమె ప్రస్తుతం 'గజ్రా'అనే చిత్రంతో మరాఠీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నారు. వాస్తవ సంఘటన ఆధారంగా రాబోతున్న ఈ చిత్రాన్ని శ్రేయాస్ జాదవ్ తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ వచ్చే ఏడాది విడుదల కాబోతుండగా.. ప్రస్తుతం అదా శర్మ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులతో పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే అదా శర్మ, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాల ఎంపికపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'ది కేరళ స్టోరీ' లాంటి పెద్ద హిట్ తర్వాత మంచి పాత్రల కొరత ఏమైనా ఎదురైందా అని యాంకర్ ప్రశ్నించగా... అదా శర్మ స్పందిస్తూ.. బాక్సాఫీస్ వద్ద ఒక పెద్ద హిట్ పడితే, ఇండస్ట్రీలో పెద్ద ప్రాజెక్టులు చేసే మేకర్స్ మీపై మరింత నమ్మకం ఉంచుతారనే విషయాన్ని తాను గ్రహించానని అదా తెలిపారు. 'ది కేరళ స్టోరీ' తర్వాత తనకి మునుపటి కంటే మెరుగైన, గొప్ప అవకాశాలు లభించాయని వెల్లడించారు. ఒక నటిగా ప్రతీ ఒక్కరూ కోరుకునే సవాలుతో కూడిన పాత్రలు, కథలో ఊహించని మలుపులు ఉండే రోల్స్, అలాగే ఒకదానికొకటి పూర్తి భిన్నంగా ఉండే క్యారెక్టర్లు ఇప్పుడు తనను వెతుక్కుంటూ వస్తున్నాయని.. తన డ్రీమ్ రోల్స్ దక్కుతున్నాయని అదా శర్మ సంతోషం వ్యక్తం చేశారు.

# సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు పెరగాలి

## మాళవిక మోహనన్

వెండితెరపై మహిళా పాత్రల్లో నిజమైన మార్పు రావాలంటే కేవలం నటీమణులు మారితే సరిపోదని, సినీ పరిశ్రమలోని ఇతర విభాగాల్లో మహిళల సంఖ్య పెరగాలని నటి మాళవిక మోహనన్ అన్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. హాలీవుడ్ యాక్షన్ చిత్రం 'కిల్ బిల్' తరహాలో నటించాలన్న తన కలను ఆమె తాజాగా బయటపెట్టారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. కమర్షియల్ సినిమాల్లో మహిళలకు విభిన్నమైన పాత్రలు రాకపోవడానికి ప్రధాన కారణాన్ని పేర్కొన్నారు. "వాస్తవానికి సినీ పరిశ్రమలో మహిళా దర్శకులు, రచయిత్రులు చాలా తక్కువ. వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. సినిమాల్లో ఫిమేల్ గేజ్ మరింత పెరగాల్సిన అవసరం ఉంది. మహిళా మేకర్స్ పెరిగినప్పుడే, అద్భుతమైన యాక్షన్ పాత్రలు పుట్టుకొస్తాయి. అప్పుడు మన దేశంలోనూ 'కిల్ బిల్'లాంటి సినిమాలు వస్తాయి. మహిళల కోణంలో సాగే కథలకు కిరణ్ రావ్ దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్' ఓ చక్కటి ఉదాహరణ. ఆ సినిమాతో పాటు, అందులోని మహిళా పాత్రలను తీర్చిదిద్దిన విధానం నన్ను బాగా ఆకట్టుకుంది. మహిళా దర్శకురాలి కోణంలో ఆ పాత్రలను చూడడం ఎంతో సంతోషంగా ఉంది" అని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం, మాళవిక మోహనన్ ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. హీరో కార్తీ సరసన 'సర్దార్ 2'లో నటిస్తున్నారు. ఈ సినిమా సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే విజయ్ సేతుపతితో కలిసి 'పాకెట్ నావెల్' అనే సినిమాలోనూ ఆమె సందడి చేయనున్నారు.



# మన వ్యక్తిత్వమే మనకు అతిపెద్ద బలం

వరుస ప్రాజెక్ట్స్ చేస్తూ ఫుల్ బిజీ బిజీ అయిపోయారు స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న. లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నారు. ఎలాంటి డూప్ లేకుండా స్వయంగా రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. 'మైసా'లో అండర్ వాటర్‌లో బిగ్ అడ్వెంచర్ చేశారు. ఇప్పటివరకూ ఇండియన్ సినీ చరిత్రలో చూడని ఓ బిగ్ సీక్వెన్స్ చేసి రికార్డ్ క్రియేట్ చేశారు. గొండ్ తెగ, సంస్కృతి నేపథ్యంతోపాటు వారికి అండగా ఉండే ఓ వారియర్ పాత్రలో గొండు మహిళగా రష్మిక ఇందులో కనిపించబోతున్నారు. రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ బిజీగా ఉన్న రష్మిక తాజాగా, ఓ ఇంటర్వ్యూలో భాగంగా సినీ ఇండస్ట్రీలో అందరూ వెళ్లే దారిలోనే తాను వెళ్లలేదని.. ఎప్పుడూ తన మనసుకు నచ్చినట్లే నడుచుకున్నానని చెప్పారు. అదే తన విజయంలో అతిపెద్ద కారణమని వెల్లడించారు. హిందీ సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతున్న సమయంలో అందరిలా ఒకే తరహా దారిలో వెళ్లకుండా, తన అంతరాత్మ చెప్పిన మాటే విన్నానని అందుకే ఈ స్థాయిలో ఉన్నానని రష్మిక అన్నారు. మొదట్లో ఈ నిర్ణయం కాస్త భయాన్ని కలిగించినప్పటికీ, చివరికి అదే ఇండస్ట్రీలో ఒక ప్రత్యేకమైన ఐడెంటిటీని తెచ్చిపెట్టిందని చెప్పారు. ఇతరులను అనుకరించడం లేదా పక్కవారి మెప్పు కోసం జీవించడం కాకుండా.. ఎవరికి వారు తమ స్వభావాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడమే నిజమైన విజయమని అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అభిమానులకు స్ఫూర్తినిచ్చే సందేశాన్ని ఇస్తూ.. ఎవరినీ చూసి కాపీ కొట్టాల్సిన అవసరం లేదు. పక్కవారి మెప్పు కోసం లేదా ప్రశంసల కోసం మిమ్మల్ని మీరు మార్చుకోకండి. మనం ఎలా ఉన్నామో అలాగే నిజాయితీగా ఉండటంలోనే మన అసలైన విలువ ఉంటుంది. మన వ్యక్తిత్వమే మనకు అతిపెద్ద బలం అని స్పష్టం చేశారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJ-GIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com